నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 28-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి:33 సంచిక:104 పేజీలు:68 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

గృహమున కాభరణములుగ
సహనమునకు రూపములుగ చక్కగ వెలిగే
మహిళలను గౌరవించెడి
స్పృహ గల నాయకుడు కోటి చీరెల నిచ్చెన్ !!

(ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలకు కోటి చీరలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇది శుభ పరిణామం.)

-రాధశ్రీ
సెల్:9494481210



చురక

నీళ్ల పైన పరస్పరం
నిందల భజ గోవిందం
ప్రభుత్వం ప్రతిపక్షం
పొందుటేల ఆనందం.
తెలంగాణ వాటాను
తేవడమే ముఖ్యం
పార్టీలు అన్నీ కలిసి
పోరాడుడే లౌక్యం.

-వేల్పుల నారాయణ
9440433475



లోక్‌సభ సీట్ల పెంపునకు కేంద్రం గ్రీన్ సిగ్నల్..



న్యూ ఢిల్లీ, నవంబర్ 27: దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. లోక్‌సభలో ఎంపీ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న దానితో పోలిస్తే 50 శాతం పెంచాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల్లో సమానంగా సీట్లను పెంచే ప్రతిపాదనకు శుక్రవారం (నవంబర్ 27) కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. పెంచిన సీట్ల కేటాయింపులో వచ్చే 25 ఏళ్ల వరకు ఎలాంటి మార్పులు ఉండవు. అంటే 2051 వరకు ఇదే విధానం కొనసాగనుంది.

డీలిమిటేషన్ బిల్లుకు కొత్త రూపు

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు పార్లమెంట్ ఆమోదం పొందేలా కేంద్రం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగానే సీట్ల పెంపునకు సంబంధించిన కీలక ప్రతిపాదనను కేబినెట్ ముందుకు తీసుకెళ్లింది. అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం సీట్లు పెంచడం ద్వారా రాష్ట్రాల ప్రాతినిధ్యానికి సంబంధించిన ఆందోళనలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుంచి వస్తున్న డిమాండ్లకు ఈ ప్రతిపాదన ప్రాధాన్యత ఇస్తోంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంపై ప్రభావం పడుతుందనే చర్చ గత కొంతకాలంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో ఒకే విధంగా సీట్లను పెంచాలనే నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.

మహిళా రిజర్వేషన్లతో ముడిపడిన బిల్లు

పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంతో కేంద్రం ఈ డీలిమిటేషన్ బిల్లును అనుసంధానించింది. మహిళా రిజర్వేషన్ల అమలుకు అవసరమైన మార్పుల్లో భాగంగా లోక్‌సభ స్థానాల పెంపు ప్రతిపాదనను కూడా చేర్చింది. తాజాగా ఆమోదించిన సవరణలతో కూడిన బిల్లును వచ్చే వారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

నవంబర్ 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

ఈ బిల్లుపై చర్చించి ఆమోదం పొందేందుకు కేంద్రం నవంబర్ 30 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించనుంది. ఇవి వర్షాకాల సమావేశాలకు కొనసాగింపుగా జరగనున్నాయి. వచ్చే వారం సభ ముందుకు రానున్న డీలిమిటేషన్ బిల్లుపై ఎలాంటి నిర్ణయం వెలువడుతుందనేది ఆసక్తికరంగా మారింది. లోక్‌సభ స్థానాల పెంపు ప్రతిపాదనకు పార్లమెంట్ ఆమోదం లభిస్తే దేశ రాజకీయ ప్రాతినిధ్యంలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా రాష్ట్రాల వారీగా సీట్ల కేటాయింపు, మహిళా రిజర్వేషన్ల అమలు వంటి అంశాలపై ఈ సమావేశాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

2బీహెచ్‌కే కాలనీలకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్ .. రూ.53 కోట్లతో కీలక పనులు

హైదరాబాద్, నవంబర్ 27: తెలంగాణ ప్రభుత్వం (ఎవశ్రీజీనిణజీనిజీ ఉనీఎవతీనిఎవనిబి) మరో కీలక నిర్ణయం తీసుకుంది. 2బీహెచ్‌కే కాలనీలకు సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ శుభవార్త చెప్పింది. క్యూర్ పరిధిలోని 2బీహెచ్‌కే ఇళ్లకు తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. నీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆయా పనుల కోసం టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు అనుమతి ఇచ్చింది. కనెక్షన్ ఛార్జీలు రాకముందే పనులు ప్రారంభించేందుకు పచ్చజెండా ఊపింది.

సాధ్యమైన చోట ముందుగానే నీటి, డ్రైనేజీ కనెక్షన్ల విడుదలకు తెలంగాణ సర్కార్ అనుమతి ఇచ్చింది. మొత్తం 17 ప్రాంతాల్లో కనెక్షన్లకు రూ.53.12 కోట్ల అంచనా వ్యయంగా నిర్ణయించింది. నీటి సరఫరా నెట్‌వర్క్ అభివృద్ధికి రూ.17.73 కోట్లుగా నిశ్చయించింది. డ్రైనేజీ నెట్‌వర్క్ అభివృద్ధికి రూ.2.27 కోట్లుగా నిర్ణయించింది. ఈ మేరకు జలమండలి ఎండీ నిర్ణయానికి ఆమోదం తెలుపుతూ జీవో నంబర్ - 1037ను తెలంగాణ సర్కార్ విడుదల చేసింది

పరిశ్రమల స్థాపనతోనే రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి కల్పన

పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం..

డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు




మహబూబ్‌నగర్, నవంబర్ 27:పరిశ్రమల స్థాపనతో రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేయడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గురువారం సిద్దిపేట జిల్లా వర్గల్ పారిశ్రామికవాడలోని ఆవుసులోనిపల్లి శివారులో వింటేజ్ కాఫీ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ పరిశ్రమల స్థాపనకు అవసరమైన రాయితీలు, విద్యుత్, తాగునీరు, రహదారుల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్, అనుమతుల ప్రక్రియను సులభతరం చేసినట్లు పేర్కొన్నారు. వింటేజ్ కాఫీ సంస్థ 22 దేశాలకు ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని తెలిపారు.

టీజీఐసీ ద్వారా ప్రభుత్వ స్థలాలను కేటాయిస్తూ పారిశ్రామికవాడలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో, ట్రిపుల్ ఆర్ మధ్య కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 70 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించామని, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డెయిరీ చైర్మన్ అమిత్ రెడ్డి, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ శుభవార్త..

విదేశీ ఉద్యోగాల కోసం కొత్త పథకానికి శ్రీకారం



హైదరాబాద్, నవంబర్ 27: తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. విదేశాల్లో ఉద్యోగాలు కోరుకునే నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. కొత్తగా ముఖ్యమంత్రి ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ ప్రారంభించాలని నిశ్చయించింది. ఈ పథకం అమలు చేయడానికి మార్గదర్శకాలను విడుదల చేసింది. తొలి ఏడాది 7 వేల మంది యువతకు లబ్ధి చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. వీసా, విమాన ప్రయాణం, విదేశీ భాషా శిక్షణ ఖర్చుల్లో 50 శాతం సబ్సిడీని కల్పించనుంది.

మొదటి కేటగిరీకి గరిష్ఠంగా రూ.50 వేల వరకు తెలంగాణ సర్కార్ ఆర్థిక సాయం చేయనుంది. రెండో కేటగిరీకి గరిష్ఠంగా రూ.1.75 లక్షల వరకు సబ్సిడీ ఇవ్వనుంది. 18 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న నిరుద్యోగులకు ఈ అవకాశం కల్పించనుంది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని యువతకు ఈ పథకాన్ని వర్తింపజేయనుంది. మహిళలకు 33.33 శాతం, దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయం తీసుకుంది.

నిర్మాణం, తయారీ, ఆటోమొబైల్, వైద్య, హోటళ్లు సహా పది రంగాల్లో ఉద్యోగావకాశాలను ప్రభుత్వం కల్పించనుంది. విదేశీ ఉద్యోగాలకు అవసరమైన భాషా, నైపుణ్య శిక్షణను టామ్‌కామ్ అందించనుంది. ఒక రేషన్ కార్డుపై కుటుంబంలోని ఒక్కరికే మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. టామ్‌కామ్ ప్రత్యేక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే ఈ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలంగాణ సర్కార్ పేర్కొంది.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు 8 వేల మంది క్రీడాకారులు.. ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష



హైదరాబాద్, నవంబర్ 27: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లపై సచివాలయంలో సీఎస్ సంజయ్ జాజు సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ ఆదేశించారు. డిసెంబర్ 8న భారత్ ఫ్యూచర్ సిటీలో రక్షణ రంగ ఎక్స్‌పో, ఎయిర్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. రక్షణ రంగ ఎక్స్‌పో, ఎయిర్ షోను వీక్షించేందుకు భారీ సంఖ్యలో విద్యార్థులను తరలించాలని ఆదేశించారు. డిసెంబర్ 11న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభోత్సవానికి విద్యార్థుల హాజరుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని తెలిపారు.

విద్యార్థుల రాకపోకల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఎఖూఖీఅకి సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే విద్యార్థులకు భోజనం, అల్పాహారం, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో సుమారు 8 వేల మంది క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులకు వసతి, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రారంభ, ముగింపు వేడుకల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని ఆదేశించారు. ఖేలో ఇండియా పోటీలకు విస్తృత మీడియా కవరేజీ కల్పించాలని అధికారులకు సీఎస్ సంజయ్ జాజు సూచనలు చేశారు.

మూసాపేట ట్రక్ యార్డు భూముల వేలానికి హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, నవంబర్ 27:మూసాపేట ట్రక్ యార్డు భూముల వేలానికి తెలంగాణ హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కూకట్‌పల్లి ట్రక్ యార్డుకు చెందిన 3.15 ఎకరాల భూముల వేలంపై కీలక తీర్పు వెల్లడించింది. ఈ వేలాన్ని సవాల్ చేస్తూ దాఖలైన రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను న్యాయస్థానం కొట్టివేసింది.


కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సామాజిక కార్యకర్త కాంతారావు దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు డిస్మిస్ చేసింది. దీంతో ఈరోజు (శుక్రవారం) జరగనున్న భూముల వేలానికి అడ్డంకులు తొలగిపోయాయి. వేలం ప్రక్రియ కొనసాగించేందుకు మార్గం సుగమమైంది. హైకోర్టు తీర్పుతో ఈ వేలంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

అనకాపల్లి జిల్లా రోడ్డు ప్రమాదంలో యువతి మృతి.. -హోం మంత్రి అనిత విచారం

అనకాపల్లి , నవంబర్ 27: అనకాపల్లి జిల్లా రేగుపాలెం వై జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై సమాచారం అందగానే అక్కడకు చేరుకున్నారు. అధికారులను వివరాలు అడిగి అనిత తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ప్రమాదం జరిగిన జంక్షన్ వద్ద సిగ్నల్ లైట్లను వెంటనే ఏర్పాటు చేయాలని హోం మంత్రి అనిత ఆదేశించారు.తండ్రితో కలిసి కూతురు కల్యాణి ఈరోజు (శుక్రవారం) కాలేజీకి బైకుపై వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

అది మీ బాధ్యత.. మదురై కలెక్టర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం..

న్యూ ఢిల్లీ, నవంబర్ 27: తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం దీపం వివాదంపై సుప్రీంకోర్టు మరోసారి తీవ్రంగా స్పందించింది. కొండపై ఉన్న రాతి స్తంభం వద్ద కార్తీక దీపాన్ని వెలిగించాలన్న న్యాయస్థానం ఆదేశాలు అమలు కాకపోవడంపై మదురై జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించింది. కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్‌దేనని స్పష్టం చేసింది. శుక్రవారం దీపం వివాదానికి సంబంధించి దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది మదురై జిల్లా కలెక్టర్ తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపిం చారు. ఈ నందర్భంగా న్యాయ స్థానం స్పందిన్తూ.. 'ఆదేశాలను అమలు చేయాల్సింది మీ ం కదా.. కలెక్టర్‌గా మీకు ఆ బాధ్యత ఉంది కదా. మీరు ఆ పని పూర్తి చేయాలి కదా.. అసలు ఏం జరిగింది..' అంటూ ప్రశ్నించింది. జిల్లా మేజిస్ట్రేట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారి కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిం దేనని స్పష్టం చేసింది.



పీడిత జన బాంధవుడు జ్యోతి రావు ఫూలే

నవంబర్ 28 ఫూలే వర్ధంతి

భారత జాతి పిత మోహన్ దాస్ గాంధీ కన్నా ముందే "మహా ాత్మునిగా" భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ చే, ""గురువుగా" భావింపబడి, ప్రకటింపబడి, జన నీరాజనాలు అందుకున్న జ్యోతిరావు ఫూలే భారత ప్రప్రథమ సామాజిక తత్వవేత్త. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న ప్రజలకు ఆత్మస్థైర్యం అందించేందుకు, వారి హక్కుల కోసం, నిరంతరం అననుకూల పరిస్థితులలో పోరాటాలు చేసి సత్య ధర్మ శోధక మండలిని స్థాపించి, పలు సమస్యల పరిష్కారానికి కృషిచేసిన మహనీయుడు ఫూలే.

సామాజిక తత్వవేత్తగా, ఉద్యమకారునిగా, సంస్కరణవాదిగా, సాంఘిక సేవా తత్పరునిగా, బాలికా విద్య ప్రోత్సాహకునిగా, మహిళా హక్కుల పరిరక్షకునిగా, కార్మిక పక్షపాతిగా, దీన జన బాంధవునిగా, లింగ వివక్షకు వ్యతిరేకిగా అణగదొక్కబడిన వర్గాల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారు ఫూలే. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్ర (బ్రిటిష్ ఇండియా)లో జన్మించిన ఫూలే. తండ్రి గోవింద రావు పీష్వాల కాలంలో పూల వ్యాపారం చేయడం వల్ల వారికి ఫూలే అని పేరు వచ్చింది. చిన్నతనంలో చదువు మానేసి, తిరిగి పుణేలో 1941లో క్రైస్తవ ముస్లిం మిత్రుల సహకారంతో , స్కాటిష్ మిషన్ లో చేరి విద్యాభ్యాసం కొనసాగించారు. పుస్తకపఠనం పై మక్కువ ఎక్కువ చూపారు. చదువుకునే సమయాన 1948లో బ్రాహ్మణ స్నేహితుని వివాహానికి హాజరైన సందర్భంగా బిసి "మాలి" కులానికి చెందిన ఫూలే కుల వివక్ష కు లోనై తీవ్ర మానసిక వ్యధ చెందారు. సదాశివ బిల్వాల్ గోవింద్ అనే బ్రాహ్మణ మిత్ర పరిచయం, సాన్నిహిత్యం, "థా మస్" రచన మానవ హక్కుల ప్రభావం, ఆయనపై ఎంతగానో ప్రభావం చూపింది. కులం, వర్ణం, ప్రాంతం, లింగాది, వివక్షతలకు అవిద్యే కారణమని భావించి, తన భార్య సావిత్రిని బడికి పంపా రాయన. 1848 ఆగస్టులో బాలికల పాఠశాలను 51--52 లో మరో రెండు పాఠశాలలను ఆదర్శ దంపతులు స్థాపించారు. 1853లో దేశంలోనే మొదటిదిగా ఫూలే వితంతువుల అనాథ శిశువుల కోసం సేవా సదనం స్థాపించారు. శ్రామిక ప్రజల కోసం 1855లో 'రాత్రి బడి'ని స్థాపించారు.1864లో "బాలహత్య ప్రతిబంధక్ గృహ" గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించి, వితంతువులలైన గర్భిణీ స్త్రీలకు అండగా నిలిచాడు.1868లో తన ఇంటి దగ్గరున్న స్నానాల తొట్టి వద్ద స్నానం చేసేందుకు అంటరాని వారికి కూడా అనుమతి ఇచ్చాడు. బాల హత్య ప్రతిబంధక్ గృహలో జన్మించిన బ్రాహ్మణ వితంతు కుమారున్ని 1872 లో దత్తత స్వీకరించారు. తాను అనుభవించిన కుల వివక్ష ఇతరులకు అనుభవానికి రాకూడదని ఆకాంక్షించారు. సహ ధర్మ చారిణి సావిత్రి తో కలిసి 40 ఏళ్ల పాటు నిర్వహించిన సామాజిక ఉద్యమాలు, ఫూలే దంపతులకు పేద జనోద్ధారకులుగా సమాజంలో గుర్తింపు తెచ్చాయి. ఎక్కడ అన్యాయం, వివక్ష చోటు చేసుకుంటే, అక్కడ ఉద్యమం నడిపారు. అణగారిన వర్గాలకే కాదు, బాధితులైన అగ్రకుల వితంతు పునర్వివాహాలకు విశేష కృషి సలిపారు. బ్రాహ్మణ వితంతువులకు శిరోముండనాలు చేయమని క్షురకులచే సమ్మెలు చేయించారు.1871 లో సత్యశోధన పక్షాన దీనబంధు పత్రిక నడిపాడు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించాడు. 1873 సెప్టెంబరు 24న సత్య శోధక సమాజాన్ని ఫూలే స్థాపించాడు. దేశంలోనే ఇది మొట్టమొదటి సంస్కరణోద్యమం. బొంబాయి నిర్మాణానికి తెలంగాణ నుండి వలస వెళ్ళి ఎదిగిన మున్నూరుకాపులే అధికం. బొంబాయిలో సత్యశోధక్ సమాజ్ శాఖ పుట్టింది సయాజీ నాగు మున్నూరుకాపు ఇంటిలోనే.ఫూలే సామాజిక సంస్కరణోద్యమానికి తుదిశ్వాస వరకు చేదోడువాదోడై నిలిచిన జాయా కారాడీ లింగు తెలంగాణం కన్న మున్నూరు కాపు బిడ్డ.కారాడి లింగు తండ్రి జాయా ఎల్లప్పలింగు ముంబె లో భవన నిర్మాణ కాంట్రాక్టరు. ఫూలే కొంతకాలం భవన నిర్మాణ కాంట్రాక్టరుగా పనిచేశారు. అప్పుడే ఆయనకు ముంబై తెలుగు ప్రజల పితామహునిగా ప్రసిద్ధులైన కాంట్రాక్టరు రామయ్య వెంకయ్య అయ్యవారితో పరిచయమైంది. వెంకయ్య ఫూలేను ముంబైకి ఆహ్వానించి, తోటి కాంట్రాక్టర్లతో కలిసి సత్య శోధక సమాజాన్ని విస్తరింపజేయడానికి, పాఠశాలలను ఏర్పాటుచేసి నడపడానికి ఆర్థిక, హార్దిక సహాయాలను అందించారు. సత్యశోధక సమాజానికి తెలుగువారి విరాళాలే ప్రధాన ఆర్థిక వనరుగా ఉండేవి. వెంకయ్య ఇల్లే అనాథ బాలల ఆశ్రమంగా ఉండేది. వారిని గొప్ప విద్యా వంతులుగా, సత్యశోధకులుగా చేసిన ఘనత వెంకయ్యదే. ఫూలే ప్రసిద్ధ గ్రంథం "గులాంగిరి" పుస్తక ప్రచురణ 1873లో వెంకయ్యనే ప్రచురించారు.

1882లో హంటర్ కమిషన్‌కు' శూద్రాతి శూద్రులకు చదువు చెప్పించాల్సిన అవసరం ఉందని నివేదికలిచ్చి, అస్పృశ్యుల కోసం బ్రిటిష్ వారిచే పాఠశాలల్ని ఏర్పాటు చేయించారు. 83 లో కల్టివేటర్ విప్ కార్డ్ (సేద్య గాడిపై చర్నాకోల) ముప్పై మూడు వ్యాసాల పుస్తకాన్ని సార్వజనిక సత్య ధర్మ పేరున ప్రచురించారు. బ్రాహ్మణేతరులచే జరిపించిన కులాంతర వివాహాలు చెల్లవని బ్రాహ్మణులు తీర్మానాలు చేస్తే, సత్యశోధన మండలి ద్వారా కోర్టుకు వెళ్లారు. 1990లో కోర్టు ఫూలే వాదనను సమర్థించింది. తద్వారా ఫూలే అమితానందం చెందారు. ఆయన వ్రాసిన 33 ఆర్టికల్స్ గల "సార్వజనిక్ సత్యధర్మ" పుస్తకంలో కుటుంబ సృష్టి నియమాల గురించి విపరిస్తూ ప్రపంచం మొత్తాన్ని ఒక కుటుంబంగా వ్యక్తీకరించాడు. సామాజిక ప్రజాస్వామ్యం సాధించటం భారత దేశానికి ముఖ్యమనే మహత్తర సందేశాన్ని అందించిన మహాత్మ ఫూలే తన గురువు అని డా బి.ఆర్. అంబేడ్కర్ ప్రకటించారు. ఫూలేకు కేవలం కుల వ్యవస్థ వ్యతిరేకతే కాదు, సామ్రాజ్యవాద వ్యతిరేకత, కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడే అవగాహన, కార్యాచరణ ఉన్నాయి. అనారోగ్యానికి గురై పడకకే పరిమితం అయిన సమయాన, తాను మృతి చెందాక, ఎవరు ఏ బాధ్యతలు స్వీకరించాలో వివరించి సామాజిక ఉద్యమాలు, విస్తరింపచేసి, ప్రగతి మార్గంలో ప్రజలను తీసుకెళ్లాలని నొక్కి చెప్పి, తన ఆదర్శాలను కొనసాగించాలని హితవు పలికి 63వ ఏట 1890 నవంబర్ 28న గురువారం రాత్రి ప్రార్థనా గీతాల మధ్య దీర్ఘ నిద్రకు మహాత్మ ఫూలే ఉపక్రమించారు. భారతావనిలో గొప్ప సాంఘిక సంస్కర్తగా ఆచంద్ర తారార్కం మహాత్మ ఫూలే మిగిలి పోనున్నారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



అంతరిక్షంలో ఎర్రని అద్భుతం : అంగారక గ్రహం

(28 నవంబర్ "రెడ్ ప్లానెట్ దినోత్సవం" సందర్భంగా)

మినియన్ ఏండ్లుగా రాత్రిపూట ఆకాశంలో మెరుస్తున్న సౌర కుటుంబంలోని నాల్గవ గ్రహం అయిన అంగారకుడిని ఎర్రని రంగును మానవ నేత్రంతో చూస్తున్నాం, అబ్బురపడుతున్నాం. దీనికి ఉన్న రంగు కారణంగా అంగారక గ్రహాన్ని రెడ్ ప్లానెట్ అని పిలుస్తున్నాం. భూమి వాతావరణం కారణంగా నీలి రంగులో కనిపిస్తే, అంగారక గ్రహం ఉపరితలంపై ఫెర్రిక్ ఆక్సైడ్ ఉండడంతో ఎర్రటి రంగు కనిపిస్తున్నది. రోమన్ యుద్ధ దేవుడి పేరు మీద ఉన్న మార్స్, సౌర కుటుంబంలో ఉన్న 4వ అతి పెద్ద గ్రహంగా, భూమిని పోలి ఉంటుంది. అనేక దేశాలు అంతరిక్ష నౌకలను అంగారకుడి వద్దకు పంపించి అన్వేషణలు కొనసాగిస్తూ, 2030 నాటికి మానవులను సహితం పంపేందుకు ప్రయత్నాలు జోరుగా జరుగుతున్నాయి. భూమికి 34 మిలియన్ల మైళ్ల దూరంలో ఉన్న అంగారకుడి ఉపరితలంపై -191 నుంచి -80 డిగ్రీల ఫారన్‌హీట్ ఉష్ణోగ్రత నమోదు అవుతూ, ఆ వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ అధికంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

అంగారకుడి అన్వేషణ లకు పునాది వేసిన మారినర్ 4 మిషన్:

3 – 4 బిలియన్ ఏండ్ల క్రితం ఏర్పడిన అంగారక (మార్స్) గ్రహం పట్ల పూర్తి శాస్త్రీయా అవగాహన కలిపించడానికి ప్రతి ఏట 28 నవంబర్ రోజు "ఎర్రటి గ్రహ దినోత్సవం (రెడ్ ప్లానెట్ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. 28 నవంబర్ 1964 రోజు అంగారక గ్రహం వైపు నాసా ప్రయోగించిన అంతరిక్ష నౌక "మారినర్ 4 మిషన్"కు గుర్తుగా ప్రతి ఏట 28 నవంబర్ రోజు రెడ్ ప్లానెట్ డే జరుపుకుంటున్నాం. ఈ నౌక 14 జూలై 1965న అంగారక గ్రహానికి 985 కిమీ సమీపానికి చేరుకుంది. ఈ ప్రయోగం ద్వారా అంగారక గ్రహం సమీపం నుంచి 22 క్లోజప్ ఫోటోలు తీయడం, ముఖ్యమైన వివరాలను పంపించడం జరిగింది. నాటి నుంచి నేటి వరకు అనేక అన్వేషణాత్మక మిషన్లు అంగారక గ్రహానికి పంపడం, విషయ సేకరణ చేయడం కొనసాగుతున్నది. ప్రస్తుతం అంగారక గ్రహం చుట్టు ఐదు అంతరిక్ష నౌకలు భ్రమిస్తున్నాయి, రెండు నౌకలు ఉపరితలంపై ఉన్నాయి. ఈ నౌకల నుంచి అమూల్యమైన సమాచారం అందుతోంది. భూమి పరిమాణంలో సగం మాత్రమే ఉన్న అంగారక గ్రహంపై అత్యంత ఎత్తైన పర్వతం ఉన్నట్లు తేలింది.

భారతదేశ ఇస్రో కూడా మంగళ్యాన్-1 అంతరిక్ష మిషన్‌ను ప్రయోగించడం జరిగింది. రెడ్ ప్లానెట్ డే వేదికగా పలు అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించిన ఫిలిమ్‌లు చూడడం, రాత్రి వేళల్లో రెడ్ ప్లానెట్‌ను చూసి ఆనందించడం, వీడియోలు వీక్షించడం, విద్యార్థులు సౌర కుటుంబ నమూనాలను తయారు చేయడం, అంతరిక్ష నౌక మారినర్ 4 మిషన్ పట్ల అవగాహన పొందడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు. నవ గ్రహాల్లో ఒకటైన భూమిపై నివసిస్తున్న నరుడు ఇతర గ్రహాలపై చేరుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు, కొంత వరకు సఫలీకృతం అవుతున్నాడు. అంగారకుడి ఆత్మను శోధించి, మానవ ఆవాసానికి అనువైన మరో గ్రాహంగా అంగారకుడిపై కాలు మోపుదాం, అద్భుత అంతరిక్ష ఆవిష్కరణలకు పునాదులు వేద్దాం.



-మధుపాళీ
9949700037

22 షెడ్యూల్డ్ భాషల్లో భారత రాజ్యాంగ నూతన ప్రతులు ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, నవంబర్ 27:రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని 22 షెడ్యూల్డ్ భాషల్లో రూపొందించిన భారత రాజ్యాంగ సవరించిన నూతన ప్రతులను భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ఈ రోజు న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆవిష్కరించారు.

ఈ నందర్భాన్ని భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో ఒక చరిత్రాత్మక మైలురాయిగా అభివర్ణించిన ఉపరాష్ట్రపతి... దేశంలోని అన్ని షెడ్యూల్డ్ భాషల్లో రాజ్యాంగాన్ని అందుబాటులోకి తీసుకురావడం భారత భాషా వైవిధ్యాన్ని, ప్రజాస్వామ్య సమ్మిళిత తత్వాన్ని ఘనంగా చాటుతోందన్నారు. మాతృభాషలో రాజ్యాంగం అందుబాటులో ఉండటం వల్ల పౌరులకు పాలన మరింత చేరువవుతుందనీ... తద్వారా ప్రజలు తమ రాజ్యాంగ హక్కులు, విధులు, విలువలను మరింత మెరుగ్గా అర్థం చేసుకోగలరని ఆయన పేర్కొన్నారు.

రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్ డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్, రాజ్యాంగ పరిషత్‌లోని ఇతర సభ్యులకు నివాళులర్పించిన శ్రీ సీపీ రాధాకృష్ణన్... రాజ్యాంగం కేవలం ఒక చట్టపరమైన విధానం మాత్రమే కాదనీ, అది దేశపు సజీవ స్ఫూర్తి అని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంలో కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్, ఆయన బృందం చేస్తున్న కృషిని ఉపరాష్ట్రపతి అభినందించారు. ఈ ప్రయత్నాలు భారత భాషా, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం పట్ల నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

దేశ భాషలు, జ్ఞాన సంప్రదాయాలను పరిరక్షించి ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపట్టిన కార్యక్రమాలనూ ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. 'జ్ఞాన భారతం', 'కాశీ తమిళ సంగమం' వంటి కార్యక్రమాలు భారత నాగరికత వారసత్వ పరిరక్షణ సహా వివిధ ప్రాంతాల మధ్య సాంస్కృతిక బంధాల బలోపేతం పట్ల నిబద్ధతనూ ప్రతిబింబిస్తున్నాయని ఆయన అన్నారు.

భారత్ బలం దాని వైవిధ్యంలోనే ఉందన్నారు. భాషలు కేవలం భావప్రసార మాధ్యమాలు మాత్రమే కాదు... సంస్కృతి, సంప్రదాయం, గుర్తింపునూ మోసుకెళ్లే వాహకాలు అని శ్రీ సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. అన్ని భారతీయ భాషల పట్ల పరస్పర గౌరవం కలిగి ఉండాలన్నారు. ప్రతి వ్యక్తికి తమ మాతృభాష పట్ల ప్రత్యేక అనుబంధం ఉన్నప్పటికీ... ఇతరుల భాషలను, మాతృభాషలనూ గౌరవించడం అంతే ముఖ్యమని శ్రీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. పౌరులంతా తమ సొంత మాతృభాషలను వేడుకగా జరుపుకోవాలనీ, భారత్‌ను సామరస్యపూర్వక దేశంగా తీర్చిదిద్దుతున్న ఈ సుసంపన్న భాషా వైవిధ్యాన్ని మనస్ఫూర్తిగా ఆహ్వానించాలనీ ఆయన పిలుపునిచ్చారు.

మహాకవి సుబ్రమణ్య భారతి మాటలను గుర్తుచేసుకుంటూ... భారత్‌లో అనేక భాషలు మాట్లాడినప్పటికీ, దేశ సేవ విషయంలో అందరి ఆలోచనలు, ఆకాంక్షలు, కార్యాచరణ ఎల్లప్పుడూ ఐక్యంగానే ఉంటాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. అన్ని 22 షెడ్యూల్డ్ భాషల్లో రాజ్యాంగాన్ని విడుదల చేయడం 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తికి ప్రతీక అని, ఇది 'వికసిత్ భారత్2047' దిశగా భారత్ సాగిస్తున్న ప్రయాణాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

దేశంలోని అన్ని భాషల పరిరక్షణ, అభ్యున్నతికి బలమైన, ఐక్య భారత్ ఎంతో అవసరమని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ 'దేశమే ప్రథమం' అనే మార్గదర్శక సూత్రంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) శ్రీ అర్జున్ రామ్ మేఘ్వాల్, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి డాక్టర్ రాజీవ్ మణితో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌తో పాటు ఇతర మహనీయులకు శ్రద్ధాంజలి ఘటించిన ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, నవంబర్ 27: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌తో పాటు రాజ్యాంగ పరిషత్తు సభ్యులందరికీ ప్రధాన మంత్రి శ్రద్ధాంజలి ఘటించారు. వారు మనకు బహుమతిగా ఇచ్చిన రాజ్యాంగం భారతదేశ ప్రజాస్వామ్యానికి ఒక అమూల్య వారసత్వమని, 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) సంకల్పాన్ని నెరవేర్చుకొనేందుకు దేశ ప్రజలకు మార్గదర్శనాన్ని అందిస్తూ ఉంటుందని ప్రధాన మంత్రి అన్నారు.

రాజ్యాంగంలో పొందుపరుచుకున్న సిద్ధాంతాలను మరింత శక్తిమంతంగా మలచుకోవాలన్న నిబద్ధతను శ్రీ మోదీ మరో మారు స్పష్టం చేస్తూ, సంస్కృత భాషలో గల ఓ సుభాషితాన్ని ప్రస్తావించారు. పండితులు అనేక మందితో కలిసి ప్రతి విషయాన్ని ఆమూలాగ్రంగా చర్చించి వివేచనతో నిర్ధారించి మరీ రూపొందించిన విధానాలు, సిద్ధాంతాలు ఎట్టి పరిస్థితులలో రూపుమాసిపోవని, అవి కల కాలం నిలచి ఉంటాయని ఈ కింద సుభాషితం సూచిస్తున్నది.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సందేశాన్ని ప్రధాన మంత్రి పొందుపరుస్తూ: ఈ పవిత్ర సందర్భంగా పూజ్య బాబాసాహెబ్‌తో పాటు రాజ్యాంగ పరిషత్తు సభ్యులైన మహనీయులందరికీ వంద నాలను ఆచరిస్తున్నాను. వారు మనకు బహుమతిగా అందించిన రాజ్యాంగం భారతీయ ప్రజాస్వామ్యానికి అందిన అమూల్య వారసత్వం. వికసిత్ భారత్ సంకల్పాన్ని సాకారం చేసుకోవడంలో మనకు రాజ్యాంగం మార్గదర్శిగా ఉంటుంది.

బొక్కులగుట్టలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఆరుగురు అరెస్ట్.. రూ.25,890 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం



ఆదిలాబాద్, నవంబర్ 27:మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొక్కులగుట్ట సిరామిక్ ఫ్యాక్టరీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, రామకృష్ణాపూర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు.

రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం అర్ధరాత్రి ఈ దాడి నిర్వహించారు. డబ్బులు పందెంగా పెట్టి అక్రమంగా పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ ఘటనలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.25,890 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐ డి. కొండ రమేష్, ఆర్ఎస్ఐ ప్రవీణ్, రామకృష్ణాపూర్ ఎస్ఐ జాడి శ్రీధర్, పోలీసు సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

నైపర్ హైదరాబాద్ 14వ స్నాతకోత్సవం 225 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం

న్యూ ఢిల్లీ, నవంబర్ 27 :హైదరాబాద్‌లోని జాతీయ ఔషధ విద్య, పరిశోధనా సంస్థ (నైపర్) తన14వ స్నాతకోత్సవాన్ని 2026 నవంబర్ 27న (శుక్రవారం) నిర్వహించనుంది. బాలానగర్ క్యాంపస్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమం 225 మంది విద్యార్థుల విద్యా ప్రయాణంలో ముఖ్యమైన ఘట్టంగా నిలవనుంది. వీరిలో 15 మంది పీహెచ్‌డీ పరిశోధకులు, 2024?26 విద్యా సంవత్సరానికి చెందిన 210 మంది మాస్టర్స్ డిగ్రీ విద్యార్థులు ఉన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేస్తారు.

కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఔషధ విభాగం సీనియర్ ఆర్థిక సలహాదారు శ్రీ అవధేష్ కుమార్ చౌదరి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ధనుష్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ శ్రీ డి.ఎస్.ఎన్. మూర్తి గౌరవ అతి థిగా పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులైన విద్యార్థి లకు డిగ్రీ పట్టాలను అతిథులు ప్రదానం చేస్తారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేస్తారు.

సంస్థ సాధించిన విద్య, పరిశోధన, ఇతర విజయాలను తెలియజేసే నివేదికను నైపర్ హైదరాబాద్ డైరెక్టర్ డా. శైలేంద్ర సరఫ్ సమర్పిస్తారు. తమ వృత్తి పరమైన పరిశోధనా రంగాల్లో అడుగుపెడుతున్న పట్టభద్ర విద్యార్థులకు మార్గనిర్దేశం చేస్తూ ప్రసంగిస్తారు.

ఔషధ విద్య, పరిశోధన రంగాల్లో విద్యార్థులు సాధించిన విజయాలను, వారి అంకిత భావం, పట్టుదల, ప్రతిభను గుర్తించి, అభినందించే సందర్భంగా ఈ స్నాతకోత్సవం నిలవనుంది. ఈ కార్యక్రమానికి నైపర్ హైదరాబాద్ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది హాజరుకానున్నారు.

దేశవ్యాప్తంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రచార కార్యక్రమం-5

న్యూ ఢిల్లీ, నవంబర్ 27:కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల జీవన సౌలభ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో, పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ అంటే జీవన్ ప్రమాణ్ వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహిస్తోంది. 2014లో బయోమెట్రిక్ పరికరాల ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ ప్రక్రియ ప్రారంభమైంది. అనంతరం, ఆధార్ డేటా బేస్ ఆధారంగా ఫేస్ ఆథెంటికేషన్ సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ఈ శాఖ ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థలతో కలిసి పని చేస్తోంది. ఈ సాంకేతికత ద్వారా ఏ ఆండ్రాయిడ్ ఆధారిత స్మార్ట్‌ఫోన్ నుంచైనా లైఫ్ సర్టిఫికెట్‌ను సమర్పించడం సాధ్యమవుతోంది.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ కోసం ముఖ గుర్తింపు సాంకేతిక వినియోగంపై కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లు, పెన్షన్ పంపిణీ సంస్థల్లో అవగాహన కల్పిం చేందుకు పెన్షన్, పెన్షనర్ల సంక్షే మ శాఖ వివిధ భాగస్వామ్య సంస్థ ల సహకారంతో ప్రతి సంవత్సరం నవంబర్ 1 నుంచి 30 వరకు దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. 2022 నుంచి ఇప్పటి వరకు ఇలాంటి నాలుగు ప్రచార కార్యక్రమాలను నిర్వహిం చింది.

దేశవ్యాప్త డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రచార కార్యక్రమం-5ను పెన్షన్, పెన్షనర్ల సంక్షేమ శాఖ 2026 నవంబర్ 1 నుంచి 30 వరకు దేశవ్యాప్తంగా 2,000 జిల్లాలు/నగరాల్లో వివిధ భాగస్వామ్య సంస్థల సహకారంతో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో రైల్వే మంత్రిత్వ శాఖ, రక్షణ మంత్రిత్వ శాఖ, తపాలా శాఖ, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ , పెన్షన్ పంపిణీ బ్యాంకులు, పెన్షనర్ల సంక్షేమ సంఘాలు, ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వాములుగా ఉన్నాయి. ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ, భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నాయి.

గరిష్ఠ సంఖ్యలో పెన్షనర్లు ఈ సేవలను వినియోగించుకునేలా భారత ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, బ్యాంకులు, నమోదిత పెన్షనర్ల సంక్షేమ సంఘాలకు వివరణాత్మక మార్గదర్శకాలను జారీ చేశారు .ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా శిబిరాలకు వచ్చే పెన్షనర్లకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను రూపొందించి అందిస్తున్నారు. భవిష్యత్తులో పెన్షనర్లు స్వయంగా డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను రూపొందించు కునేలా ఈ ప్రక్రియపై అవగాహన కూడా కల్పిస్తున్నారు. అవసరమైన పెన్షనర్లకు వారి ఇంటి వద్దకే సేవలను అందిస్తున్నారు. ముఖ్య o గా వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, దివ్యాంగ పెన్షనర్లకు ఈ సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

కుమార్తెను దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేసిన తండ్రి అరెస్ట్

హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించి, మృతదేహాన్ని దహనం

ఆదిలాబాద్, నవంబర్ 27:ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ సబ్ డివిజన్ పరిధిలోని నార్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఉమ్రి గ్రామంలో యువతి అనుమానాస్పద మృతి కేసులో నిందితుడైన ఉట్నూర్ ఏఎస్పీ రిత్విక్ సాయి కొట్టే



ఆమె తండ్రి అడే కైలాష్‌ను నార్నూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ ఏఎస్పీ రిత్విక్ సాయి కొట్టే తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిందితుడి కుమార్తె అడే కళ్యాణి ఈ నెల 24న ఉరివేసుకుని మృతి చెందినట్లు తొలుత సమాచారం అందిందన్నారు. అయితే బంధువులు వచ్చే వరకు వేచి చూడకుండా నిందితుడు అదే రోజు ఉదయం మృతదేహాన్ని హడావుడిగా దహనం చేయడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు నార్నూర్ పోలీసులు క్రైమ్ నంబర్ 146/2026, బీఎన్ఎస్ సెక్షన్లు 103(1), 238 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు.

పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. కళ్యాణికి వివాహం నిశ్చయమై మరో రెండు రోజుల్లో నిశ్చితార్థం జరగాల్సి ఉంది. అయితే ఆమె మరో వ్యక్తిని ప్రేమిస్తున్న విషయం తెలుసుకున్న తండ్రి ఆగ్రహంతో హత్యకు పథకం వేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని ఏఎస్పీ తెలిపారు. ఈ నెల 24న తెల్లవారుజామున కుమార్తె ముఖంపై దిండుతో అదిమి ఊపిరాడకుండా చేసి హత్య చేసినట్లు విచారణలో తేలిందన్నారు. అనంతరం చున్నీతో ఇంటి పైకప్పు దూలానికి ఉరివేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. నేరాన్ని కప్పిపుచ్చేందుకు మృతదేహాన్ని హడావుడిగా దహనం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించామని పేర్కొన్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, కేసులో మరిన్ని ఆధారాలు సేకరించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని ఏఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో నార్నూర్ సీఐ డి. గురుస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇండియా మైనింగ్ వీక్-2027తో ఏఐసీ ఐఐటీ ఢిల్లీ భాగస్వామ్యం

న్యూ ఢిల్లీ, నవంబర్ 27:నీతి ఆయోగ్‌కు చెందిన అటల్ ఇన్నోవేషన్ మిషన్ మద్దతుతో పనిచేస్తున్న 'అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఐఐటీ ఢిల్లీ ? సోనిపట్ ఇన్నోవేషన్ ఫౌండేషన్'... ప్రతిష్ఠాత్మక 'ఇండియా మైనింగ్ వీక్-2027' సదస్సుకు జాతీయ స్టార్టప్ అవుట్‌రీచ్, ఎకోసిస్టమ్ భాగస్వామిగా వ్యవహ రించనుంది. భారత ప్రభుత్వ బొగ్గు, గనుల మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో... ఎంజీఎంఐ, ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సు 2027 ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు న్యూఢిల్లీలోని యశోభూమి కన్వెన్షన్ సెంటర్‌లో జరగనుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా మైనింగ్, బొగ్గు, ఖనిజాలు, అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న అంకురసంస్థలు, డీప్-టెక్ పారిశ్రామికవేత్తలు, పరిశోధకులు, ఆవిష్కర్తలను ఈ వేదికపైకి తీసుకురావడానికి ఏఐసీ ఐఐటీ ఢిల్లీ దేశవ్యాప్త ప్రచారం నిర్వహిస్తుంది.



భారత్-నేపాల్ సరిహద్దు సమీపంలో పశ్చి చంపారణ్‌లో 19 కిలోలకు పైగా ఏనుగు దంతాల స్వాధీనం.. నలుగురి అరెస్టు



న్యూ ఢిల్లీ, నవంబర్ 27:వన్యప్రాణుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చేపట్టిన ఒక పెద్ద చర్యలో భాగంగా, రెవెన్యూ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ (డీఆర్ఐ) భారత్-నేపాల్ సరిహద్దు సమీపంలో పశ్చి చంపారణ్‌లో 19 కిలోలకు పైగా ఏనుగు దంతాల స్వాధీనం చేసుకోవడమే కాకుండా దీనిలో ప్రమేయం ఉన్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసింది. ఈ దాడికి బీహార్ రాష్ట్ర పోలీసు విభాగం కూడా సహకారాన్ని అందించింది.

రహస్య సమాచారాన్ని అందుకున్న మీదట, డీఆర్ఐ అధికారులు బీహార్ రాష్ట్ర పోలీస్ విభాగంతో సమన్వయాన్ని ఏర్పరుచుకొని, నిన్నటి రోజున రెండు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులను ఆపారు. అనుమానిత వ్యక్తులలో ఒకరి వద్ద ఒక సంచీ ఉంది. అందులో ఏనుగు దంతాలు ఉండి ఉండవచ్చని భావించారు. అనుమానితులు పరారయ్యే ప్రయత్నం చేసి, అధికారులను ప్రతిఘటించారు. అయితే వారిని విజయవంతంగా పట్టుకున్నారు అధికారులు. సోదా చేయగా, 19.39 కేజీల ఏనుగు దంతాలు దొరికాయి. వాటిని వన్యప్రాణుల (పరిరక్షణ) చట్టం-1972కు సంబంధించిన సెక్షన్ల ప్రకారం జప్తు చేశారు.

ఏనుగులను వన్యప్రాణుల (పరిరక్షణ) చట్టం-1972లోని ఒకటో షెడ్యూలులో భాగంగా కాపాడుతున్నారు. వాటిని కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎండేజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫౌన అండ్ ఫ్లోర (సీఐటీఈఎస్)లోని ఒకటో అనుబంధంలో కూడా చేర్చారు.

భారతీయ చట్టాలు చెబుతున్న ప్రకారం, ఏనుగు దంతాల వ్యాపారం నిషిద్ధం. ఏనుగు దంతాలను అక్రమంగా రవాణా చేయడమన్నది ఏనుగుల సంరక్షణకు ముప్పుగా పరిణమిస్తుంది.

ఈ దాడి వన్యప్రాణుల అక్రమ తరలింపునకు వ్యతిరేకంగా ప్రభావవంతమైన చర్యలను చేపట్టడంతో పాటు, సంరక్షిత ప్రజాతుల చట్టవిరుద్ధ వ్యాపారంలో పాల్గొంటున్న ముఠాలను అరికట్టడంలో డీఆర్ఐ చాటుకుంటున్న నిబద్ధతకు ఓ నిదర్శనంగా కూడా ఉంది. దీని కోసం రహస్య సమాచారం ఆధారంగా ఇతర నేర నియంత్రణ ఏజెన్సీలతో సన్నిహిత సమన్వయాన్ని ఏర్పరుచుకొని మరీ కార్యకలాపాలను చేపడుతున్నారు.

అత్యుత్తమ ప్రమాణాలతో జాతీయ రహదారుల అభివృద్ధి వల్ల సైనిక విమానాల ల్యాండింగ్‌కు వెసులుబాటు

న్యూ ఢిల్లీ, నవంబర్ 27: గుజరాత్‌లోని పటాన్ వద్ద అమృత్‌సర్ - జామ్‌నగర్ ఆర్థిక కారిడార్ (ఎన్‌హెచ్-754ఏ)పై 2026 నవంబర్ 24న భారత సైన్యానికి చెందిన నాలుగు విమానాలు విజయవంతంగా ల్యాండ్ అయ్యాయి.

ఈ ప్రదర్శన ద్వారా తగిన విధంగా అత్యుత్తమ ప్రమాణాలతో రూపకల్పన చేసిన జాతీయ రహదారులు అత్యవ సర, వ్యూహాత్మక అవసరాలతో సహా ప్రత్యేక కార్యకలాపాలకు కూడా ఉ ప యో గ ప డ గ ల వని నిరూపితమైంది.

భారత సైన్యానికి చెందిన 'టీమ్ మౌంటెన్ ఈగల్స్' బృందంలోని రెండు ఫిక్స్‌డ్ వింగ్ మైక్రోలైట్ విమానాలు, రెండు పవర్డ్ హ్యాంగ్ గ్లైడర్లు ఈ ప్రద ర్శనలో పాల్గొన్నాయి.

మిలిటరీ కాలేజ్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఎంసీటీఈ), మోవ్‌లోని ఆర్మీ అడ్వెంచర్ నోడల్ సెంటర్ (ఏఏఎన్‌సీ) నిర్వహించిన 'వింగ్స్ ఆఫ్ వాలర్ అండ్ యూనిటీ ఎక్స్‌పెడిషన్ - 2026' లో భాగంగా ఈ విమానాలు కాండ్లా విమానాశ్రయం నుంచి బయలుదేరాయి.

57వ ఐఎఫ్ఎఫ్ఐ వేదికగా అస్కార్ ఎంట్రీల ప్రక్రియ, ప్రపంచస్థాయి అవకాశాలపై సినిమా రూపకర్తలకు అవగాహన కల్పించిన నటాలీ వేడ్

న్యూ ఢిల్లీ, నవంబర్ 27: గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో భాగంగా... ఈ రోజు కళా అకాడమీలో నిర్వహించిన 'డీకోడింగ్ అకాడమీ అవార్డ్స్' మాస్టర్‌క్లాస్‌లో సినిమా రూపకర్తలు, విద్యార్థులు, సినీ అభిమానులకు ఆస్కార్ అవార్డుల ఎంపికకు సంబంధించిన అనేక కీలక అంశాలపై అవగాహన కల్పించారు. అకాడమీ పురస్కారాల కోసం చిత్రాల సమర్పణ ప్రక్రియ, అర్హత ప్రమాణాలు, ప్రచార వ్యూహాలు, వర్ధమాన ప్రతిభావంతులకు అందుబాటులో ఉన్న అవకాశాలపై ఈ సమావేశంలో వివరించారు.

అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌లో మెంబర్ రిలేషన్స్, పురస్కారాల నిర్వహణ విభాగం ఉపాధ్యక్షురాలు శ్రీమతి నటాలీ వేడ్ ఈ మాస్టర్‌క్లాస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ఎఫ్ఐ ఫెస్టివల్ డైరెక్టర్ శ్రీ అశుతోష్ గోవారికర్ ఆమెను ఘనంగా సత్కరించారు.

అకాడమీ పురస్కారాల పరిశీలన కోసం ఒక చిత్రాన్ని సమర్పించే సుదీర్ఘ ప్రక్రియపై చాలామంది సినిమా రూపకర్తలకు సరైన అవగాహన ఉండటం లేదని శ్రీమతి వేడ్ పేర్కొన్నారు. ప్రారంభ సమర్పణ దశ నుంచి పురస్కారాల తుది దశ వరకు ఉండే అధికారిక విధానాలు, నియమ నిబంధనలు, ఆవశ్యక తలపై సినిమా రూపకర్తలకు సంపూర్ణ అవగాహన కల్పించడం... ఆ ప్రక్రియలోని సంక్లిష్టతను తొలగించడమే ఈ మాస్టర్‌క్లాస్ ప్రధాన ఉద్దేశమని ఆమె వివరించారు. ఆస్కార్ విజేత 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' సహా భారతీయ సినిమాకు లభించిన అంతర్జాతీయ గుర్తింపును ప్రస్తావిస్తూ... సినిమా భౌగోళిక సరిహద్దులకు అతీతమైనదని ఆమె కొనియాడారు. భారత్ సహా విశ్వవ్యాప్తంగా ఉన్న సినీ ప్రతిభావంతులందరికీ అకాడమీ వేదికగా నిలుస్తోందని ఆమె అన్నారు.

తన ప్రజెంటేషన్‌లో భాగంగా... జనరల్ ఎంట్రీ, ఉత్తమ చిత్రం విభాగాల పరిశీలనకు ఉండాల్సిన అర్హత ప్రమాణాలు, ఎంపిక మార్గాలను శ్రీమతి వేడ్ వివరించారు. అమెరికాలోని ఆరు నిర్దేశిత మెట్రోపాలిటన్ నగరాల్లో కనీసం ఏదో ఒక నగరంలో వరుసగా ఏడు రోజుల పాటు థియేటర్లలో ప్రదర్శించాల్సిన నిబంధనను గురించి ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో పాటు నటన, సినిమాటోగ్రఫీ, దర్శకత్వం, ఫిల్మ్ ఎడిటింగ్, సంగీతం, సౌండ్, విజువల్ ఎఫెక్ట్స్, రచన వంటి వివిధ విభాగాల్లో పోటీ పడేందుకు ఉండాల్సిన అర్హతలనూ ఆమె చర్చించారు.

ఉత్తమ అంతర్జాతీయ చిత్రం, డాక్యుమెంటరీ ఫీచర్, షార్ట్ ఫిల్మ్ విభాగాల్లో పోటీ పడేందుకు పాటించాల్సిన సమర్పణ నియమాలను వివరిస్తూ... గుర్తింపు పొందిన అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్ ద్వారా నేరుగా అర్హత పొందే మార్గాలను ఆమె తెలియజేశారు. అకాడమీ సభ్యులు సినిమాలను వీక్షించే అధికారిక వేదికైన 'అకాడమీ స్క్రీనింగ్ రూమ్' పనితీరు, అందుకు అవసరమైన సాంకేతిక నిబంధనలు, సమర్పణ పద్ధతులు, చెల్లించాల్సిన ఫీజుల గురించి ఈ మాస్టర్‌క్లాస్‌లో పూర్తి సమాచారం అందించారు.

అకాడమీ అందించే శాస్త్రీయ, సాంకేతిక పురస్కారాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ... చలనచిత్ర నిర్మాణ సాంకేతికతను ముందుకు తీసుకెళ్లే వినూత్న ఆవిష్కరణలకు లభించే గుర్తింపు గురించి శ్రీమతి వేడ్ వివరించారు. వర్ధమాన సినిమా రూపకర్తలు, స్క్రీన్‌ప్లే రచయితలకు మార్గదర్శనం చేస్తూ, వృత్తిపరమైన అవకాశాలనూ కల్పించే... అకాడమీకి చెందిన 'గ్లోబల్ టాలెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్'నూ ఆమె పరిచయం చేశారు. వీటిలో భాగమైన 'స్టూడెంట్ అకాడమీ పురస్కారాలు', స్క్రీన్‌రైటింగ్‌లో అందించే 'నికోల్ ఫెలోషిప్స్', మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'అకాడమీ గోల్డ్ ఫెలోషిప్ ఫర్ విమెన్' కార్యక్రమాల వివరాలనూ ఆమె తెలియజేశారు.ప్రశ్నోత్తరాల కార్యక్రమంతో ఈ మాస్టర్‌క్లాస్ ముగిసింది.

ఈ సందర్భంగా చిత్రాల అర్హత ప్రమాణాలు, అంతర్జాతీయ ఎంట్రీల సమర్పణ, చలన చిత్రోత్సవాల ద్వారా అర్హత సాధించే మార్గాలు, సాంకేతిక నిబంధనలపై సభికుల సందేహాలకు శ్రీమతి వేడ్ సమాధానాలిచ్చారు. సందేహాల నివృత్తి కోసం, సరైన మార్గదర్శనం కోసం నిరభ్యంతరంగా అకాడమీని సంప్రదించాలని ఆమె సినిమా రూపకర్తలను ప్రోత్సహించారు. ఆస్కార్ సమర్పణ ప్రక్రియను సులభంగా పూర్తి చేయడంలో సినిమా రూపకర్తలకు అకాడమీ ప్రతినిధులు, స్థానిక సంప్రదింపు కేంద్రాలు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాయని ఆమె స్పష్టం చేశారు.



74,636 మంది ప్రజల భాగస్వామ్యంతో ముగిసిన 'నషా ముక్త్ యువ, వికసిత్ భారత్ క్విజ్'

న్యూ ఢిల్లీ, నవంబర్ 27: కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' (ఎన్ఎంబీఏ) కింద నిర్వహించిన ఆన్‌లైన్ 'నషా ముక్త్ యువ, వికసిత్ భారత్ క్విజ్'.. దేశవ్యాప్తంగా ప్రజల ప్రోత్సాహక రమైన భాగస్వామ్యంతో 2026 నవంబర్ 25న ముగిసింది.

ఈ క్విజ్‌లో మొత్తం 74,636 మంది పాల్గొన్నారు. వీరంతా 20 ప్రశ్నలకు గాను 13.82 నగటు స్కోరు సాధించారు. అత్యధిక స్కోరు 20గా నమోదైంది. క్విజ్‌లో పాల్గొన్నవారు దానిని పూర్తి చేయడానికి సగటున సుమారు 4 నిమిషాలు వెచ్చించారు. మత్తుపదార్థాల వినియోగ నివారణపై అవగాహనను బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజల చురుకైన భాగస్వామ్యాన్ని ఇది తెలియజేస్తోంది.

యువతలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించడానికి, సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడానికి 20 బహుళ ఐచ్ఛిక ప్రశ్నలతో రూపొందించిన ఈ క్విజ్‌ను 2026 అక్టోబర్ 26న 'మై భారత్' పోర్టల్ ద్వారా ప్రారంభించినట్లు మంత్రిత్వ శాఖలోని ఒక సీనియర్ అధికారి తెలిపారు.

క్విజ్‌ను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత పాల్గొన్న వారికి భాగస్వామ్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లు.. మాదకద్రవ్యాల వినియోగ నివారణపై వారి అవగాహనను మరింత పెంపొందించడానికి సరైన మార్గాలను కూడా అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

2020 ఆగస్టు 15న ప్రారంభించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'.. నివారణ విద్య, అవగాహన కల్పన, చికిత్స, పునరావాసం, సమాజ భాగస్వామ్యం ద్వారా మాదకద్రవ్యాల డిమాండ్ తగ్గింపు ప్రయత్నాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆ అధికారి తెలిపారు.

మొదట్లో 272 ప్రభావిత జిల్లాలలో ప్రారంభించిన ఈ కార్యక్రమం.. తదనంతరం దేశంలోని అన్ని జిల్లాలకు విస్తరించి మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ఒక దేశవ్యాప్త ప్రజా ఉద్యమంగా అవతరించిందని ఆయన పేర్కొన్నారు.

నషా ముక్త్ భారత్ అభియాన్ 14.40 కోట్ల మంది యువత, 11.38 కోట్ల మంది మహిళలతో సహా 35.97 కోట్లకు పైగా ప్రజలకు చేరువైందని.. దీనికున్న విస్తృత వ్యాప్తిని, పెరుగుతున్న ప్రజా భాగస్వామ్యాన్ని ఇది తెలియజేస్తోందని ఆ అధికారి తెలిపారు.

నషా ముక్త్ భారత్ అభియాన్ విద్యార్థులు, యువతలో అవగాహన పెంపొందించడానికి.. సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడానికి విద్యా సంస్థల్లో 34.40 లక్షలకు పైగా కార్యకలాపాలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు.

సామాజిక న్యాయం, సాధికారత విభాగం (డీఓఎస్‌జేఈ) మద్దతుతో దేశవ్యాప్తంగా పనిచేస్తున్న 755 కంటే ఎక్కువ వ్యసన విముక్తి కేంద్రాల నెట్‌వర్క్ ద్వారా 39.91 లక్షల మందికి చికిత్స, పునరావాసం కల్పించినట్లు ఆ అధికారి తెలిపారు.

నషా ముక్త్ భారత్ అభియాన్‌కు సమాజ భాగస్వామ్యం ఒక ప్రధాన అంశంగా కొనసాగుతోందన్న ఆయన.. ప్రజలు 50.45 లక్షలకు పైగా 'నషా ముక్త్' ప్రతిజ్ఞలు చేశారని తెలిపారు. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పన, ప్రజల సమీకరణ, నివారణ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి 2 లక్షలకు పైగా 'నషా ముక్తి మిత్రలు' నమోదు చేసుకున్నారని ఆ అధికారి వివరించారు.

మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజా అవగాహనను మరింత పెంపొందించడానికి, సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించడానికి, యువతను అవగాహన- నివారణ ప్రచారకర్తలుగా తీర్చిదిద్దడానికి 'నషా ముక్త్ యువ, వికసిత్ భారత్ క్విజ్' కీలక పాత్ర పోషించింది. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన పునాదిగా ఆరోగ్యకరమైన, సాధికారత కలిగిన, వ్యసన రహిత సమాజం అనే దార్శనికతను ఈ కార్యక్రమం మరింత బలోపేతం చేస్తోంది.

ఇటువంటి క్విజ్ కార్యక్రమాల ద్వారా సమాజ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని, బాధ్యతాయుతమైన నిర్ణయాలను ప్రోత్సహించాలని, మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా జరుగుతున్న దేశవ్యాప్త ఉద్యమంలో ప్రజలు, ముఖ్యంగా యువత అర్థవంతమైన సహకారం అందించేలా వారిని సమీకరించాలని మంత్రిత్వ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

కార్తీక శుక్రవారం.. భీమేశ్వరుడి దర్శనానికి భక్తజనం

50 వేల మందికి పైగా భక్తుల దర్శనం.. రూ.25 లక్షల ఆదాయం



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 27:(నేటినిజం ప్రతినిధి): కార్తీక మాసం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక శుక్రవారం కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమై రోజంతా ఆలయంలో సందడి నెలకొంది.

సుమారు 50 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వివిధ రూపాల్లో ఆలయానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిసింది. భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

భక్తులకు సౌకర్యవంతమైన దర్శనానికి ఏర్పాట్లు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. దేవస్థానం ఈఓ రమాదేవి ఆలయ పరిసరాలను, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్తీక మాసం నేపథ్యంలో భీమేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి పెరగడంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

310 ఇందిరమ్మ ఇళ్లు.. 10 రోజుల్లో సిద్ధం!

90 శాతం పూర్తయిన నిర్మాణ పనులు.. త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, నవంబర్ 27:నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ఖమ్మం నగరంలోని వెలుగుమట్లలో నిర్మిస్తున్న 310 ఇందిరమ్మ ఇళ్లకు తుది మెరుగులు దిద్దుతున్నారు. శుక్రవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ఇళ్ల నిర్మాణం, కాలనీలో మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు.

15వ డివిజన్ పరిధిలోని భూదాన్ భూమిలో గతంలో కొందరు వ్యక్తులు, సంఘాలు పేదలకు నకిలీ పట్టాలు ఇచ్చి డబ్బులు వసూలు చేసినట్లు మంత్రి తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు భూదాన్ భూమిని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని, అక్కడ నివసిస్తున్న నిజమైన నిరుపేదలను గుర్తించి వారి కోసం 310 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు.

ప్రస్తుతం ఇళ్ల నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను మరో 7 నుంచి 10 రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కాలనీలో బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, పార్కు, డ్రైనేజీ, ఓపెన్ జిమ్ తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వెలుగుమట్ల ఇందిరమ్మ ఇళ్లు, మౌలిక సదుపాయాలను ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని మంత్రి తెలిపారు. భారత్ సమ్మిట్ కార్యక్రమాల నేపథ్యంలో సీఎంతో చర్చించి ప్రారంభోత్సవ తేదీని ఖరారు చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో హౌసింగ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ పర్యటనలో డీఆర్డీఏ పీడీ కె. శ్రీరామ్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, నగరపాలక సంస్థ డీఈ నవ్యజ్యోతి, అధికారులు, పాల్గొన్నారు

మద్యం మత్తులో డ్రైవింగ్.. ప్రాణాలకు ముప్పు

-సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితే



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 27:(నేటినిజం ప్రతినిధి): మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల డ్రైవింగ్పై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితే పేర్కొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పాల్గొని మద్యం సేవించి పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో మద్యం సేవించి డ్రైవింగ్ చేయబోమని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల డ్రైవింగ్పై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఒక్కరి నిర్లక్ష్యం ఇతరుల ప్రాణాలకూ ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. అతివేగం, వాల్మెట్ లేకుండా ప్రయాణించడం, రాంగ్ రూట్, మైనర్ల డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అరైవ్- అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

పీఎం రాహత్ పథకం ద్వారా ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందుతుందని, జిల్లాలోని ఏడు ఆసుపత్రుల్లో ఈ సేవలు పొందవచ్చని వివరించారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్లో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి రహవీర్ పథకం కింద రూ.25 వేల ప్రోత్సాహకం అందిస్తారని పేర్కొన్నారు. ప్రమాద బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐ వీరప్రసాద్, ఎన్ఐలు ప్రేమానందం, శ్రీనివాస్, రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవాలి, పరిరక్షించాలి, నిత్యజీవితంలో ఆచరించాలి: నల్సార్ వీసీ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు



న్యూ ఢిల్లీ, నవంబర్ 27:రాజ్యాంగం ప్రతి పౌరుడిదని, అందులోని ఆదర్శాలను అర్థం చేసుకోవాలని, పరిరక్షించాలని, నిత్యజీవితంలో ఆచరించాలని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఈ రోజు హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ విద్యాసంస్థలో నిర్వహించిన ఫొటో ప్రదర్శన ఆ అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

భారత రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం మాత్రమే కాదని, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే సజీవ సాధనమని ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు పేర్కొన్నారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ మౌలిక సూత్రాలను అర్థం చేసుకొని, వాటిని కాపాడాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు, పౌరులకు పిలుపునిచ్చారు. డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్, రాజ్యాంగ సభలోని ఇతర సభ్యుల కృషిని గుర్తుచేస్తూ, రాజ్యాంగ రూపకల్పనకు దారితీసిన విస్తృత చర్చలు, నమాలో చనలను ఆయన వివరించారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించారని, 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిందని చెబుతూ ఆ తేదీల ప్రాధాన్యాన్ని వివరించారు.

రాజ్యాంగ పీఠిక ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. భారత రాజ్యాంగ విలువలకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం మూనాదులని అని ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రాథమిక హక్కులు, రాజ్యాంగబద్ధ పాలన, న్యాయవ్యవస్థ స్వతంత్రత, మౌలిక స్వరూప సిద్ధాంతం ప్రాధాన్యాన్ని కూడా ఆయన వివరించారు.

సామాజిక పరివర్తనలో రాజ్యాంగం పాత్రను ప్రస్తావిస్తూ.. వ్యవస్థాగత అసమానతలను పరిష్కరించడం, వివక్షను తొలగించడం, పౌరులందరికీ గౌరవం, సమాన అవకాశాలు కల్పించడం రాజ్యాంగ నిబంధనల లక్ష్యమని ఆయన అన్నారు. రాజ్యాంగంపై అవగాహన మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ.. రాజ్యాంగాన్ని చదవడం, రాజ్యాంగ సభ చర్చలను అర్థం చేసుకోవడం అలవాటుగా చేసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచించారు. రాజ్యాంగ అవగాహన ప్రాథమిక హక్కులకే పరిమితం కాకుండా ప్రాథమిక విధులు, ప్రజాస్వామ్య ప్రక్రియలో బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని కూడా కలిగి ఉండాలని స్పష్టం చేశారు.

సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ చొరవను ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు అభినందించారు. భారత రాజ్యాంగ చరిత్ర, విలువలు, ప్రాధాన్యాన్ని యువతకు పరిచయం చేయడంలో అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. రాజ్యాంగంపై అవగాహన పెంపొందించేందుకు విద్యాసంస్థలు, పౌర సమాజ సంస్థలు చురుగ్గా కృషి చేయాలని ఆయన కోరారు.

పౌరులు తమ ప్రాథమిక హక్కులు, విధులను అర్థం చేసుకునేలా రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని, అందులోని నిబంధనలను సులభంగా వివరించాలని డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ జీ. వినోద్ పేర్కొన్నారు. డాక్టర్ బీ.ఆర్. అంబేడ్కర్ కృషిని ఆయన కొనియాడారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందించేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందని, దాదాపు 1.5 లక్షల మంది విద్యార్థులకు విద్యను అందించిందని తెలిపారు.

స్వర్ణగిరి క్షేత్రంలో వైభవంగా కార్తీక పూజలు

రామానుజాచార్యులకు పంచామృతాభిషేకం.. కనులపండువగా స్వామివారి తిరువీధి ఉత్సవం

నల్గొండ, నవంబర్ 27: స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నిత్య, విశేష ఆధ్యాత్మిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

వేకువజామున స్వామివారికి సుప్రభాత సేవ, గోపృష్ట దర్శనం అనంతరం వేదమంత్రోచ్చారణల నడుమ నిత్యారాధన, సహస్రనామార్చన సేవలు నిర్వహించారు. స్వర్ణాభరణాలు, పుష్పమాలలతో స్వామివారిని అలంకరించారు.

ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ రామానుజాచార్య స్వామివారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు.

కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా అష్టలక్ష్మి మండపంలో కార్తీక దామోదర హవనం, వైభవ మండపంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం జరిపించారు. అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామివారి నిత్యకల్యాణ మహోత్సవాన్ని వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 3 వేల మందికి పైగా భక్తులు స్వామివారి నిత్యాన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. ప్రాణాలకు ముప్పు

-సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితే

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 27:(నేటినిజం ప్రతినిధి):



మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల డ్రైవింగ్పై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి.గితే పేర్కొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పాల్గొని మద్యం సేవించి పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. భవిష్యత్తులో మద్యం సేవించి డ్రైవింగ్ చేయబోమని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనం నడపడం వల్ల డ్రైవింగ్పై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఒక్కరి నిర్లక్ష్యం ఇతరుల ప్రాణాలకూ ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. అతివేగం, వాల్మెట్ లేకుండా ప్రయాణించడం, రాంగ్ రూట్, మైనర్ల డ్రైవింగ్కు దూరంగా ఉండాలని సూచించారు. అవైర్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

పీఎం రాహత్ పథకం ద్వారా ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందుతుందని, జిల్లాలోని ఏడు ఆసుపత్రుల్లో ఈ సేవలు పొందవచ్చని వివరించారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్లో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి రహవీర్ పథకం కింద రూ.25 వేల ప్రోత్సాహకం అందిస్తారని పేర్కొన్నారు. ప్రమాద బాధితులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఐ వీరప్రసాద్, ఎస్ఐలు ప్రేమానందం, శ్రీనివాస్, రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మంలో రెడ్‌క్రాస్ సేవల విస్తరణకు సమగ్ర ప్రణాళిక

రక్త నిల్వ కేంద్రం, ప్లాస్మా సేవల ఏర్పాటుకు ప్రతిపాదనలు.. 15 రోజుల్లో కార్యాచరణ సిద్ధం చేయాలి: కలెక్టర్



ఖమ్మం, నవంబర్ 27 :ఖమ్మం జిల్లాలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎన్. సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులతో సమావేశమై సేవా కార్యక్రమాలు, నిధుల సమీకరణ, మౌలిక సదుపాయాలపై చర్చించారు.

రక్తదానం, ప్లాస్మా సేవలకు ప్రాధాన్యం

ఆధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో రక్తదాన శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రక్త నిల్వ కేంద్రం, ప్లాస్మా సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. రెడ్‌క్రాస్‌కు సొంత భవనం, అవసరమైన వైద్య సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. జీజీహెచ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలి

డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలల విద్యార్థులను రెడ్‌క్రాస్ సేవల్లో భాగస్వాములను చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండేలా నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించాలని సూచించారు. రక్తదానం, నేత్రదానం వంటి సేవా కార్యక్రమాలను తరచూ నిర్వహించాలన్నారు.

15 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక

రెడ్‌క్రాస్ ద్వారా తొలి ఏడాదిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు, నిధుల సమీకరణ తదితర అంశాలతో కూడిన సమగ్ర ప్రణాళికను 15 రోజుల్లో సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇతర జిల్లాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి ఖమ్మం జిల్లాకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సమర్థవంతమైన సేవా కార్యక్రమాల ద్వారా గవర్నర్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సీఎస్ఆర్ నిధులు పొందే అవకాశాలపై దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జి. వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కె. కిరణ్‌కుమార్, కార్యదర్శి కె. సత్యనారాయణ, కోశాధికారి రాఘవరావు, సభ్యులు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు కె. రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌తో విచారణ జరిపించాలి: బీరం హర్షవర్ధన్‌రెడ్డి



నాగర్‌కర్నూల్, నవంబర్ 27: కొల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులపై దాడులు, హత్యలు కొనసాగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. కోడేరు గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తూ, నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

శుక్రవారం భాస్కర్‌రెడ్డి భార్య పుష్పావతమ్మతో కలిసి జిల్లా ఎస్పీ సంగ్రామ్‌సింగ్‌ను కలిసిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం వినతిపత్రం అందజేసింది. అనంతరం ఎస్పీ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాస్కర్‌రెడ్డిపై దాడి చేసిన వారిపై కేవలం పిటిషన్ కేసు నమోదు చేయడం సరికాదని, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలో గతంలోనూ శ్రీధర్‌రెడ్డి, మల్లయ్య హత్యలు, పలువురిపై దాడులు జరిగాయని హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. భాస్కర్‌రెడ్డి ఘటనలో పోలీస్ డివిజన్ అధికారి బుద్ధి శ్రీనివాసులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయనపై తమకు నమ్మకం లేదని, ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే కోడేరు పోలీస్‌స్టేషన్‌ను బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

భాస్కర్‌రెడ్డి భార్య పుష్పావతమ్మ మాట్లాడుతూ.. తన భర్తపై కొందరు వ్యక్తులు పథకం ప్రకారం దాడి చేశారని ఆరోపించారు. తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లిన సమయంలో తన భర్త ఫోన్ చేసి తనపై దాడి చేస్తున్నారని చెప్పారని, అక్కడికి వెళ్లి చూడగా రక్తపు మడుగులో పడి ఉన్నారని కన్నీటి పర్యంతమయ్యారు. గతంలోనూ వాకింగ్‌కు వెళ్లినప్పుడు బెదిరింపులు ఎదురైనట్లు తన భర్త చెప్పారని వెల్లడించారు. ప్రస్తుతం తన భర్త ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్హులందరికీ బీమా కల్పించాలి

-అదనపు కలెక్టర్ భుజంగరావు

నిజామాబాద్, నవంబర్ 27: భీమ్‌గల్ మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రక్రియను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భుజంగరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నమోదు ప్రక్రియ పురోగతిని పరిశీలించి, అర్హులందరికీ బీమా సౌకర్యం కల్పించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రేషన్ కార్డులో నమోదై ఉన్న 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల కుటుంబ యజమానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా వర్తిస్తుందని తెలిపారు. బీమా నమోదు సమయంలో నామినీ వివరాలను కూడా నమోదు చేస్తున్నందున, అర్హులైన కుటుంబాలన్నీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.గ్రామంలో ఎక్కువ సంఖ్యలో నమోదు జరిగేలా చర్యలు చేపట్టాలని, దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసి, నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శి రాహుల్‌ను ఆదేశించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ పాలకవర్గం, వార్డు సభ్యులు తమ తమ వార్డుల్లో ప్రజలకు కుటుంబ జీవిత బీమాపై అవగాహన కల్పించి, గ్రామపంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాహుల్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి'

-నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి వి.వినోద్ కుమార్


నల్గొండ, నవంబర్ 27: ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా యాసంగిలో సరిపడా నీటి లభ్యత లేనందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని నల్లగొండ జిల్లా వ్యవసాయ అధికారి వి.వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం చండూరు మండలం దోనిపాముల గ్రామంలోని కరువు ప్రభావిత పత్తి పొలాలను ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించారు. కరువు కారణంగా పంట నష్టాన్ని అంచనా వేయడానికి త్వరలోనే కేంద్ర బృందం పర్యటించనున్న నేపథ్యంలో ఈ పర్యటన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుతడి పంటలు వేయడం వల్ల నీటి వాడకం తగ్గుతుందని, అలాగే పప్పు ధాన్యాల వల్ల భూమిసారం పెంపొందించుకోవచ్చన్నారు.

రెండు రోజులు మైదానంలోకి వాకర్స్‌కు నో ఎంట్రీ

ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్ష..

వరంగల్, నవంబర్ 27: ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో ట్రైసిటీ పరిధిలోని వాకర్స్‌కు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత విజ్ఞప్తి చేశారు. ఈ నెల 29న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ట్రైసిటీలోని 32 కేంద్రాల్లో టీఎస్ఎల్పీఆర్బీ ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.భద్రతా ఏర్పాట్లలో భాగంగా పరీక్షా కేంద్రాలుగా ఉన్న కళాశాలలు, పాఠశాలల మైదానాల్లో వాకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకు సెయింట్ గాబ్రియేల్ స్కూల్ (కాజీపేట), ఆర్ట్స్ కాలేజ్, కాకతీయ డిగ్రీ కాలేజ్, కేయూ క్యాంపస్, ఎల్బీ కాలేజ్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల మైదానాల్లో వాకర్స్‌కు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.





డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

నషా ముక్త్ భారత్ యాత్రలో పాల్గొన్న సినీ ప్రముఖులు
యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావడం సంతోషకరం
అమీర్‌పేట నుంచి ఫిల్మ్‌నగర్ వరకు కొనసాగిన పాదయాత్ర



హైదరాబాద్, నవంబర్ 27: డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రముఖ సినీ నటుడు నాగార్జున పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన నషా ముక్త్ భారత్ యాత్రలో ఆయన పాల్గొన్నారు. యాత్రలో భాగంగా యువత, విద్యార్థులతో కలిసి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. దేశాన్ని మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేపట్టిన నషా ముక్త్ భారత్ యాత్ర మూడో రోజు కొనసాగుతోంది. శుక్రవారం అమీర్‌పేట నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఫిల్మ్‌నగర్ వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు నాగార్జున, దర్శకుడు బోయపాటి శ్రీనివాస్, నటులు సాయికుమార్, శివారెడ్డి పాల్గొన్నారు. పలువురు యువత, విద్యార్థులు కూడా యాత్రలో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు.

పాదయాత్ర సందర్భంగా నాగార్జున డ్రగ్స్ రహిత భారత్ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై సమాజంలో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న సంకల్పం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని చేపట్టిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నాగార్జున అభినందించారు. యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమని అన్నారు. మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు దెబ్బతినకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

డ్రగ్స్ సమస్యను అరికట్టడం ఒక్కరి బాధ్యత కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని నాగార్జున పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, తమ తోటి వారిలోనూ అవగాహన కల్పించాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం చేపట్టే ఇలాంటి కార్యక్రమాలకు ప్రజల నుంచి మరింత మద్దతు అవసరమని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంపై అదనపు కలెక్టర్ ఆగ్రహం

కిలో తరుగు తీయొద్దు..
నాణ్యత విషయంలో రాజీ వద్దు
గన్నీ సంచులు, జీపీఎస్ ట్రాక్టర్లు, యాప్, ట్యాబ్ ఎంట్రీలపై అధికారులకు ప్రశ్నలు

హన్మకొండ, నవంబర్ 27:(నేటినిజం ప్రతినిధి) ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యంపై అదనపు కలెక్టర్ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాయంపేట మండలంలోని పెద్దకోడపాక ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఏపీఎం, సీసీ, కేంద్ర నిర్వాహకులను పలు అంశాలపై నిలదీశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో రైతుల నుంచి కిలో కూడా తరుగు తీయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. రైతులు కూడా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. గన్నీ సంచులు ఎందుకు సమకూర్చుకోలేదని, జీపీఎస్ ఉన్న ట్రాక్టర్లను ఎందుకు ఏర్పాటు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ఈ ఏర్పాట్లన్నీ ముందుగానే చూసుకోవాల్సిన బాధ్యత ఏపీఎంపై ఉందని స్పష్టం చేశారు.

యాప్ ఇన్‌స్టాల్ చేసుకోకపోవడం, ట్యాబ్‌లో వివరాలు నమోదు చేయకపోవడం వంటి సమస్యలు ఎందుకు తలెత్తుతున్నాయని ప్రశ్నించారు. ఈ సమస్యల పరిష్కారం కోసమే తాను క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. 15 రోజుల ముందుగానే సమావేశాలు నిర్వహించి కొనుగోళ్లకు సిద్ధం కావాలని సూచించినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఏపీఎం, సీసీ, కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు.

111 కోర్సుల్లో ప్రవేశాలకు గ్యాట్-2027.. మార్చి 27న పరీక్ష



విశాఖపట్నం, నవంబర్ 27: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు ప్రాంగణాల్లో నిర్వహిస్తున్న 111 యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్ట్ (గ్యాట్-2027)ను వచ్చే ఏడాది మార్చి 27న నిర్వహించనున్నట్లు గీతం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పరీక్ష విధానం, కోర్సులు, స్కాలర్‌షిప్‌ల వివరాలను వెల్లడించారు.

ఇంజినీరింగ్, సైన్స్, ఫార్మసీ, పారామెడికల్, ఆర్కిటెక్చర్, లా, మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఎంబీఏ ప్రవేశాలకు ప్రత్యేకంగా జీబీఏటీ-2027 నిర్వహిస్తామని, క్యాట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ప్రవేశ పరీక్షలు, జేఈఈ, సీయూఈటీ వంటి జాతీయ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన వారికి గ్యాట్ నుంచి మినహాయింపుతో పాటు మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్‌లు అందిస్తామని వెల్లడించారు. క్రీడలు, రక్షణ, భద్రతా విభాగాల సిబ్బంది కుటుంబాలకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ విద్యాలయాల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు పాత్‌వే స్కాలర్‌షిప్‌ల ద్వారా ఉచిత విద్య, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు.

గీతం హైదరాబాద్ ప్రాంగణంలో నాలుగేళ్ల బీఏ-బీఈడీ, బీఎస్సీ-బీఈడీ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని, ఎన్‌సీఈటీ ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు అర్హతలు, దరఖాస్తు విధానం, పరీక్షా కేంద్రాల వివరాల కోసం గీతం అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో గీతం అడ్మిషన్స్ డైరెక్టర్ ఎం. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులకు ఇబ్బందులు

బోనస్ బోగస్‌గా మారింది..
కరువు పరిస్థితుల్లో రైతులకు పరిహారం అందించాలి
మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



వరంగల్, నవంబర్ 27: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. గురువారం తొర్రూరు పట్టణంలోని అన్నారం రోడ్డులో భద్రకాళి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ ఇబ్బందులను దయాకర్‌రావుకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు కనీస గిట్టుబాటు ధర కూడా లభించడం లేదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం కారణంగా రైతులు దళారులకు ధాన్యం విక్రయించాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు. రైతుల సంక్షేమమే లక్ష్యమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రైతులకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలును విస్మరించిందని విమర్శించారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి సకాలంలో చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాల్సి ఉండగా, నిర్లక్ష్యం కారణంగా రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. రైతు భరోసా పథకం అమలులోనూ రైతులకు ఎదురు చూపులే మిగిలాయని, రుణమాఫీ విషయంలో కూడా అనేకమంది రైతులకు పూర్తిస్థాయిలో ప్రయోజనం అందలేదని ఆరోపించారు. పెట్టుబడి సాయం, గిట్టుబాటు ధర, బోనస్, రుణమాఫీ వంటి హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకొని పంటలు పండించినప్పటికీ చివరకు వాటిని అమ్ముకునేందుకు ఇబ్బందులు పడాల్సి రావడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బోనస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అర్హులైన రైతులందరికీ రైతు భరోసా, రుణమాఫీ పథకాల ప్రయోజనాలు అందించాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు తీసుకొని రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నవంబర్ 29న సైకిల్‌పై జరిగే 100వ ఫిట్ ఇండియా సండేస్ కోసం భారతదేశం సన్నద్ధమవుతోంది..

న్యూఢిల్లీ, నవంబర్ 27:భారతదేశాన్ని మరింత ఫిట్‌గా, ఆరోగ్యకరమైన దేశంగా మార్చాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, 2024 డిసెంబర్‌లో ప్రారంభమైన 'ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం, సైక్లింగ్ ద్వారా ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించడానికి అన్ని వర్గాల ప్రజలను ఏకతాటపైకి తెస్తూ, ఒక దేశవ్యాప్త ఉద్యమంగా ఎదిగింది.

ఈ కార్యక్రమం న్యూఢిల్లీలో కేవలం 250 ప్రదేశాలలో, 500 మంది పాల్గొనేవారితో ప్రారంభమైంది. రెండేళ్లలోపే, 'సండేస్ ఆన్ సైకిల్' ఒక ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంది. రాజ్యాంగ దినోత్సవం థీమ్‌తో నిర్వహించిన దీని 99వ ఎడిషన్‌లో, దేశవ్యాప్తంగా 26,000కు పైగా ప్రదేశాలలో లక్షలాది మంది పౌరులు పాల్గొన్నారు.

ఈ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుంటూ, ఈ ఉద్యమం ఇప్పుడు తన 100వ 'సండేస్ ఆన్ సైకిల్' వేడుకలకు సిద్ధమవుతోంది. 'సండేస్ ఆన్ సైకిల్' యొక్క ఈ చారిత్రాత్మక ఎడిషన్, భారత దేశంలో ఒలింపిక్ ఉద్యమాన్ని జరుపుకోవడానికి అంకితం చేయబడింది.

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా, పూణేలోని పింప్రి-చించ్వాడ్ నుండి 100వ 'సండేస్ ఆన్ సైకిల్' వేడుకలకు నాయకత్వం వహించనున్నారు. ఈ ఉద్యమంలో సుమారు 50,000 మంది సైక్లిస్టులు పాల్గొననున్నారు.

మై భారత్ సహకారంతో, దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో యువత 100వ 'సండేస్ ఆన్ సైకిల్' వేడుకను జరుపుకోనున్నారు.

అంతేకాకుండా, దేశవ్యాప్తంగా 100 ప్రముఖ, విశిష్ట ప్రదేశాలలో ఈ వేడుకలను నిర్వహిస్తారు. భారతదేశాన్ని మరింత ఫిట్‌గా మార్చే దిశగా సైకిల్ తొక్కేందుకు, ఈ మైలురాయి వేడుకలో 100 మంది భారత ఒలింపియన్లు కూడా పాల్గొంటారు.

రాబోయే ఈ ఎడిషన్, ఒలింపిక్ ఉద్యమానికి మూలస్తంభాలైన విలువలను చాటిచెబుతుంది: సుపరిపాలన మరియు సమగ్రత, నిష్పక్షపాతమైన పోటీ మరియు నమ్మికత్వం, క్రీడాకారుల ఆరోగ్యం మరియు సంక్షేమం, ఇంకా సుస్థిరత మరియు సురక్షితమైన క్రీడల శాశ్వత వారసత్వం.

ఇది నైతిక విలువలు, క్రీడాకారుల గళం, మహిళలు మరియు పారా-అథ్లెట్లతో సహా అందరికీ సమాన అవకాశాల ఆధారంగా తన క్రీడా భవిష్యత్తును నిర్మించుకోవాలనే భారతదేశ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. అలాగే, క్రీడలు మరియు ఫిట్‌నెస్‌ను ఒక జీవన విధానంగా స్వీకరించేలా యువతను ప్రేరేపించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ప్రతిరోజూ ఫిట్‌నెస్‌కు కనీసం అరగంట కేటాయించాలనే లక్ష్యంతో, ప్రధానమంత్రి ఇచ్చిన "ఫిట్‌నెస్ కా డోస్, ఆధా ఘంటా రోజ్" (ఫిట్‌నెస్‌కు ఒక మోతాదు, అర గంట రోజ్) పిలుపు నుండి ఈ ఉద్యమం స్ఫూర్తి పొందింది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి కీలక జాతీయ పిలుపులను, సామాజిక సందేశాలను ముందుకు తీసుకువెళ్లడానికి, వాటిని భారీ ప్రజా భాగస్వామ్యం ద్వారా ఆచరణలోకి తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఒక వేదికగా రూపుదిద్దుకుంది.

'స్థూలకాయంపై పోరాటం', 'నషా ముక్త్ భారత్', 'కాలుష్యానికి పరిష్కారం' వంటి ఇతివృత్తాలపై కేంద్రీకరించిన ప్రత్యేక సంచికల ద్వారా, 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమం ప్రవర్తనా మార్పును ప్రోత్సహించడానికి, అలాగే 'ఫిట్ ఇండియా', 'వికీర్ణ భారత్' అనే ప్రధానమంత్రి గారి దార్శనికతకు పౌరులు తమ వంతు సహకారం అందించేలా ప్రేరేపించడానికి కృషి చేస్తోంది.

న్యూఢిల్లీలో రెండు రోజుల విద్యుత్ మంత్రుల సదస్సు ప్రారంభం

న్యూఢిల్లీ, నవంబర్ 27:రెండు రోజుల విద్యుత్ మంత్రుల సదస్సు ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభమైంది. కేంద్ర విద్యుత్, గృహ & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ మనోహర్ లాల్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సదస్సుకు (నవంబర్ 27-28, 2026) 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల నుండి విద్యుత్ మంత్రులు, ఉన్నతాధికారులు, విద్యుత్ నియంత్రణ శాఖ అధికారులు హాజరవుతున్నారు. జాతీయ స్థాయిలో చివరిసారిగా ఇటువంటి సదస్సు 2024లో జరిగింది.

భారత విద్యుత్ రంగంలోని కీలక విధాన ప్రాధాన్యతలు, అమలులో ఎదురయ్యే సవాళ్లపై కేంద్ర-రాష్ట్రాల మధ్య చర్చలకు ఈ సదస్సు ఒక వేదికను అందిస్తుంది. ఇంధన భద్రతను బలోపేతం చేయడం, విద్యుత్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, రంగ సంస్కరణలను వేగవంతం చేయడంపై ఈ చర్చలు కేంద్రీకృతమై ఉంటాయి.

పాల్గొన్న రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రులకు, ఇతర ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, విద్యుత్ రంగాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని శ్రీ మనోహర్ లాల్ నొక్కి చెప్పారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడంలో, పునరుత్పాదక ఇంధనాన్ని అనుసంధానించడంలో, జాతీయ గ్రిడ్‌ను బలోపేతం చేయడంలో భారతదేశం గణనీయమైన పురోగతి సాధించిందని ఆయన అన్నారు. మన ప్రయాణంలో తదుపరి దశలో, విద్యుత్ రంగ ప్రణాళికకు సంబంధించి మరింత సమగ్రమైన విధానం వైపు మనం పయనించాలి. ఈ విధానంలో ఉత్పత్తి, నిల్వ, ప్రసారం, పంపిణీ అనేవి ఒకే వ్యవస్థలో పరస్పరం అనుసంధానించబడిన అంశాలుగా ప్రణాళిక చేయబడతాయి. వినియోగదారులకు గణనీయమైన ప్రయోజనాలను అందించే స్మార్ట్ మీటర్లను రాష్ట్రాలు తప్పనిసరిగా అమలు చేయాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రాల సహకారం, విద్యుత్ మంత్రిత్వ శాఖ చొరవతో డిస్కామ్‌లు సుదీర్ఘ కాలం తర్వాత లాభదాయకతను సాధించాయని కూడా మంత్రి తెలిపారు.రాబోయే రెండు దశాబ్దాలలో దేశ విద్యుత్ రంగం రూ. 200 లక్షల కోట్ల పెట్టుబడి అవకాశాన్ని కల్పిస్తోందని, దీనిని సాకారం చేయడానికి సంబంధిత వర్గాలన్నీ కలిసి పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు. దీనిని సాధించేందుకు మనం ప్రైవేట్ రంగంతో కలిసి పనిచేయాలని ఆయన అన్నారు.

2024-25 ఆర్థిక సంవత్సరంలో డిస్కామ్‌లు మొత్తంగా సానుకూల పన్ను అనంతర లాభాన్ని (ఖయి) సాధించినందుకు, శ్రీ మనోహర్ లాల్ రాష్ట్రాలను మరియు డిస్కామ్‌లను అభినందించారు. మన డిస్కామ్‌ల ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని, అలాగే ఈ పురోగతి కొనసాగడానికి విధానాలు, కార్యకలాపాలు మరియు నిబంధనలలో అవసరమైన మార్పులు దోహదపడాలని ఆయన అన్నారు.

సదస్సు యొక్క ప్రధాన అజెండాను వివరిస్తూ, ఆయన ఈ విధంగా తెలియ జేశారు: వనరుల సమృద్ధి (ఖీం) ప్రణాళిక అమలు, వేగవంతమైన ఇంధన నిల్వ విస్తరణతో సహా; అంతర్రాష్ట్ర మరియు రాష్ట్ర అంతర్గత ప్రసార సమస్యలు; పంపిణీ సంస్థల (డిస్కామ్‌ల) ఆర్థిక సాధ్యాసాధ్యాలు; స్మార్ట్ మీటరింగ్, ఫీడర్ విభజన మరియు గృహ విద్యుదీకరణపై దృష్టి సారించి, పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం (ఖీఆూూ) అమలు; మరియు అణు కేంద్రాలకు సంబంధించిన సమస్యలు వంటి కీలక అంశాలపై విద్యుత్ మంత్రిత్వ శాఖ, రాష్ట్రాలు మరియు ఇతర భాగస్వాముల మధ్య ఈ సదస్సులో సంప్రదింపులు మరియు లోతైన చర్చలు జరుగుతాయి.

విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద యెస్సో నాయక్ తన ప్రసంగంలో, సదస్సులో పాల్గొంటున్న రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు తమ అనుభవాలను పంచుకోవాలని కోరారు. అమలులో ఎదురయ్యే ఇబ్బందులు, నియంత్రణ సమస్యలు మరియు కేంద్ర ప్రభుత్వం నుండి మరింత మద్దతు లేదా జోక్యం అవసరమయ్యే రంగాల గురించి తెలియజేయాలని సూచించారు. మనందరి దృష్టి విధాన రూపకల్పన నుండి సమర్థవంతమైన అమలు వైపు, మౌలిక సదుపాయాల కల్పన నుండి కొలవగల ఫలితాల వైపు, మరియు వ్యక్తిగత జోక్యాల నుండి సమీకృత మరియు సుస్థిర విద్యుత్ రంగం వైపు పయనించడంపై ఉండాలని మంత్రి అన్నారు.

పాల్గొన్నవారిని ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యుత్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ పంకజ్ అగర్వాల్, 'విక్షిత్ భారత్ ఏ 2047' సాధనలో భాగంగా ఇంధన భద్రతకు అతీతంగా నిజమైన ఇంధన స్వాతంత్ర్యం వైపు పయనించాలన్నదే ప్రధానమంత్రి నుంచి అందిన ప్రధాన మార్గదర్శకమని పేర్కొన్నారు. గడిచిన సంవత్సరం రికార్డు స్థాయి వృద్ధిని నమోదు చేసిందని ఆయన అన్నారు. భారతదేశం యొక్క స్థాపిత సామర్థ్యం ఇప్పుడు సుమారు 563 గిగావాట్లు (ఉచి) కాగా, అందులో 55% కంటే ఎక్కువ శిలాజేతర ఇంధనమేనని ఆయన తెలిపారు.

రక్తహీనత అనారోగ్యానికి సంకేతం..


విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి
చదువుతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలి..
జుక్కల్‌లో ఉచిత రక్త పరీక్షలు

కామారెడ్డి, నవంబర్ 28:(నేటినిజం ప్రతినిధి) రక్తహీనత అనారోగ్యానికి సంకేతమని, విద్యార్థినులు చదువుతోపాటు ఆరోగ్యాన్ని కూడా



కాపాడుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బాన్సువాడ డివిజన్ వైస్ చైర్మన్ డాక్టర్ విక్రమ్, జుక్కల్ శాఖ చైర్మన్ డి. ఉమాకాంత్ సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జుక్కల్ శాఖ ఆధ్వర్యంలో, ఆర్‌బీఎస్‌కే సౌజన్యంతో గురువారం జుక్కల్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి రక్త గ్రూపులను గుర్తించి వివరించారు. పలువురు విద్యార్థినుల్లో రక్తహీనత ఉన్నట్లు గుర్తించడంతో హిమోగ్లోబిన్ శాతం పెంచుకునే మార్గాలపై అవగాహన కల్పించారు.

ప్రతి విద్యార్థిని హిమోగ్లోబిన్ స్థాయి 12 గ్రాముల కంటే తక్కువ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శరీరంలో రక్త శాతం పెంపొందించేందుకు ఆకుకూరలు, కూరగాయలు, డ్రై ఫ్రూట్స్, బెల్లం, పాలు, పండ్లు, గుడ్లతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. దీనివల్ల నెలసరి సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని పేర్కొన్నారు. చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ఆరోగ్యంగా ఉండటం ఎంతో అవసరమని సూచించారు.



ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్ కాశీ తమిళ సంగమం 5.0 యొక్క ఐదవ ఎడిషన్ ప్రారంభం

న్యూ ఢిల్లీ, నవంబర్ 27:భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్, 2026 నవంబర్ 28 నుండి డిసెంబర్ 12 వరకు వారణాసిలో జరగనున్న కాశీ తమిళ సంగమం (ఐూ) యొక్క ఐదవ ఎడిషన్‌ను ప్రారంభించనున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ముగింపు సమావేశానికి హాజరుకానున్నారు. తమిళనాడు మరియు కాశీ మధ్య ఉన్న శతాబ్దాల నాటి సాంస్కృతిక, భాషా మరియు నాగరిక సంబంధాలను వేడుకగా జరుపుకోవడానికి ఈ కార్యక్రమం 1,400 మందికి పైగా ప్రతినిధులను ఒకచోట చేర్చుతుంది.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి దార్శనికతతో ప్రేరణ పొందిన ఈ కార్యక్రమం, రెండు ప్రాంతాల మధ్య బంధాలను బలోపేతం చేయడానికి మరియు 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రోత్సహించడానికి ఉద్దేశించబడింది. తమిళ సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధి చెందిన రచనలలో ఒకటైన తిరుక్కురళ్ యొక్క శాశ్వతమైన జ్ఞానాన్ని మరియు నైతిక బోధనలను ఈ ఐదవ సంచిక ఘనంగా చాటిచెబుతుంది.

ఈ కార్యక్రమాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖలోని ఉన్నత విద్యా విభాగం, ఐఐటి మద్రాస్, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (బిహెచ్‌యు), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్లాసికల్ తమిళ్ (సిఐసిటి), ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం మరియు అనేక కేంద్ర ప్రభుత్వ విభాగాలు, మంత్రిత్వ శాఖల సహకారంతో నిర్వహిస్తోంది.

కెటిఎన్ 5.0 ఇతివృత్తం – "తిరుక్కురళ్ పయిల్వోం ? తిరుక్కురళ్ అభ్యాస్ కరేన్"

కాశీ తమిళ సంగమం 5.0 యొక్క ఇతివృత్తం "తిరుక్కురళ్ పయిల్వోం ? తిరుక్కురళ్ అభ్యాస్ కరేన్", అంటే "తిరుక్కురళ్‌ను నేర్చుకుందాం". భారతదేశపు గొప్ప సాహిత్య సంప్రదాయాలు, శాశ్వత సాంస్కృతిక వారసత్వం పట్ల ప్రశంసను ప్రోత్సహిస్తూ, ముఖ్యంగా విద్యార్థులు మరియు యువతలో తిరుక్కురళ్ యొక్క కాలాతీతమైన జ్ఞానంపై అవగాహన మరియు గ్రహణశక్తిని పెంపొందించడంపై దృష్టి కేంద్రీకరించబడింది.ప్రఖ్యాత తమిళ కవి మరియు తత్వవేత్త అయిన తిరువళ్లువర్ రచించిన తిరుక్కురళ్, తమిళ సాహిత్యంలో అత్యంత శాశ్వతమైన రచనలలో ఒకటి మరియు తరతరాలుగా మార్గదర్శకత్వాన్ని అందిస్తూనే ఉంది. దీనిలోని 1,330 శ్లోకాలు నీతి, పరిపాలన, మానవ సంబంధాలు, కరుణ, క్రమశిక్షణ మరియు బాధ్యతాయుతమైన జీవనం వంటి అంశాలను అన్వేషిస్తాయి. ఈ గ్రంథం ధర్మబద్ధమైన ప్రవర్తన, సామాజిక మరియు రాజకీయ జీవితం, మరియు మానవ సంబంధాల సూత్రాలను కలిగి, అరం (సద్గుణం), పొరుళ్ (సంపద) మరియు ఇన్‌బం (ప్రేమ) అనే మూడు భాగాలుగా విభజించబడింది.

జగిత్యాలలో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..

జగిత్యాల, నవంబర్ 27: స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాల హాస్టల్‌లో విద్యార్థిని నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో సహచర విద్యార్థినులు వెంటనే స్పందించి.. కళాశాల యాజమాన్యానికి సమాచారం అందించారు.

దీంతో ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించింది. అయితే తోటి విద్యార్థులు, అధ్యాపకుల వేధింపుల కారణంగానే తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు ఆరోపించింది.

ఈ వేధింపులపై ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. వారికి ఫిర్యాదు చేయడంతో.. తనను మరింత వేధింపులకు గురి చేశారని పేర్కొంది. తనను అసభ్య పదజాలంతో దూషిస్తూ మానసికంగా వేధించారని వెల్లడించింది. అయితే ఈ ఘటన బయటకు రాకుండా ప్రైవేట్ ఆస్పత్రికి తరలించేలా ఒత్తిడి చేశారంటూ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కళాశాల యాజమాన్యాన్ని నర్సింగ్ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

పరిశ్రమలతో జేఎన్‌టీయూహెచ్ పరిశోధనలకు కొత్త దిశ

పరిశోధన ప్రాజెక్టులకు ప్రోత్సాహం.. విభాగాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు



హైదరాబాద్, నవంబర్ 27: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్) పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ హైదరాబాద్ (యూసీఈహెచ్) విభాగాధిపతులు పరిశోధన ప్రాజెక్టులు, ప్రచురణలు, పీహెచ్‌డీ పరిశోధనలు, పరిశ్రమలతో అనుసంధానమైన అంశాలపై 16 ప్రజెంటేషన్లు ఇచ్చారు.

ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేపట్టాలని సూచించారు. బీహెచ్‌ఈఎల్ ఆర్ అండ్ డీ, ఏఆర్‌సీఐ, డీఆర్‌డీఓ వంటి సంస్థలతో కలిసి పరిశోధనలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లతో కలిసి పనిచేసే అవకాశాలను అన్వేషించాలని అధ్యాపకులకు సూచించారు.

విద్యార్థులకు సంయుక్త పరిశోధనలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేలా త్వరలో జేఎన్‌టీయూహెచ్-పరిశ్రమల పరిశోధన సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమలతో అనుసంధానం, కన్సల్టెన్సీ ద్వారా ఆదాయం పెంచుకునేందుకు విభాగాల వారీగా పరిశోధన ప్రొపోజల్స్ రూపొందించాలని సూచించారు. పరిశోధన, కన్సల్టెన్సీ కార్యకలాపాలకు అవసరమైన పరికరాలు, సదుపాయాల కోసం ప్రతి విభాగానికి గణనీయమైన బడ్జెట్ కేటాయించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు, పరిశోధకులకు సీడ్ ఫండ్ పెంచడంతో పాటు అంతర్విభాగ పరిశోధనలను ప్రోత్సహించాలని విభాగాధిపతులు కోరారు. వారి సూచనలను పరిశీలిస్తామని ఆర్ అండ్ డీ సెల్ డైరెక్టర్ డాక్టర్ వి. హిమబిందు తెలిపారు. ఈ సమావేశంలో రెక్టర్ డాక్టర్ ఏ. దామోదరం, విశ్వవిద్యాలయ డైరెక్టర్లు, యూసీఈహెచ్ ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. దర్గా కుమార్ వందన సమర్పణ చేశారు.

రూ.36 వేల కోట్ల పెట్టుబడులు, వేలాది ఉద్యోగాలకు ఏపీ క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్!



అమరావతి, నవంబర్ 27:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు (శుక్రవారం) రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఈ క్యాబినెట్ భేటీలో మంత్రులతో పలు కీలక అంశాలపై సీఎం చర్చించారు. దాదాపు 3గంటల పాటు ఈ భేటీ జరిగింది. ఏపీ క్యాబినెట్‌లో మంత్రులతో చర్చించి సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఊతమిచ్చే 30 అంశాల అజెండాను మంత్రిమండలి ఆమోదించింది. ఆయా పరిశ్రమల ఏర్పాటులో జాప్యం నివారించేలా ఏపీ ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు-2026కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్న ఆరు సంస్థల పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించింది. ఆరు సంస్థల ద్వారా దాదాపు రూ.36 వేల కోట్ల పెట్టుబడులు.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది.

శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో రూ.19 వేల కోట్లతో కియా రెండో ఆటోమొబైల్ ప్లాంట్ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. శ్రీకాకుళంలో రూ.13,667 కోట్లతో అదానీ ఇంటిగ్రేటెడ్ టైటానియం కాంప్లెక్స్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అచ్యుతాపురంలో రూ.1,800 కోట్లతో సెయింట్ గోబైన్ ఫ్లోట్ గ్లాస్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఆమోదించింది. అమరావతిలో హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ నిర్మాణాల పనులకు భారీగా నిధులను కేటాయించడానికి పచ్చజెండా ఊపింది. సమీకృత సచివాలయం, ఆయా శాఖాధిపతుల కార్యాలయాల నిర్మాణ వ్యయం రూ.4,688 కోట్ల నుంచి రూ.6,641 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అమరావతిలో గ్రామ పంచాయతీల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.1,215 కోట్ల పనులను చేయడానికి ఆమోదించింది. శాఖమూరులో అమరావతి సంగమం నిర్మాణానికి రూ.626 కోట్ల ప్రతిపాదనకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

కోల్ ఇండియాతో జాయింట్ వెంచర్ ఏర్పాటు..

రాజధానిలో గ్రీన్‌ఫర్ట్ ప్యాకేజీ-2 కింద రూ.180.68 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం కోల్ ఇండియాతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయడానికి ఏపీజెన్‌కోకు అనుమతి ఇచ్చింది. కడప జిల్లా మైలవరంలో 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు 1,127 ఎకరాల భూమిని కేటాయించాలని నిర్ణయించింది. నంద్యాల జిల్లాలో 210 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు బదిలీకి అనుమతి ఇచ్చింది. ప్రకాశం జిల్లాలో రోజుకు 12 టన్నుల సామర్థ్యంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. అనంతపురం జిల్లాలో 9,917 ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అనంతపురం జిల్లాలో 4,352 మంది పట్టాదారులకు ప్రయోజనం కలిగేలా భూ రికార్డుల సవరణకు అనుమతి ఇచ్చింది. రైల్వేకోడూరు పరిధిలో 10,192 ఎకరాల భూములకు సంబంధించి వెబ్‌ల్యాండ్ రికార్డుల సవరణకు పచ్చజెండా ఊపింది. భూ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ, అసైన్డ్, వివాదాస్పద భూములకు కొత్త హక్కులు కల్పించారాదని స్పష్టమైన నిబంధనలు విధిస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది.

భార్యల మధ్య గొడవలు భరించలేక.. వారిని హత్య చేసిన సోదరులు

రాంచీ, నవంబర్ 27: భార్యల మధ్య నిత్యం జరుగుతున్న గొడవలను సోదరులు భరించలేక పోయారు. ఈ నేపథ్యంలో ఆగ్రహంతో వారిద్దరిని హత్య చేశారు. ఆ తర్వాత అటవీ ప్రాంతంలో మృతదేహాలను పూడ్చిపెట్టారు. దర్యాప్తు చేసిన పోలీసులు అన్నాదమ్ములతో పాటు వారి తల్లిదండ్రులను కూడా అరెస్టు చేశారు. జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్న శివ శంకర్ సాహు, నవీన్ సాహు అన్నాదమ్ములు. వారి భార్యలైన 28 ఏళ్ల మినీ ప్రియ, 20 ఏళ్ల రాధిక కుమారి మధ్య చాలా కాలంగా గొడవలు కొనసాగుతున్నాయి.

కాగా, తమ కుటుంబంలో జరుగుతున్న ఈ గొడవలను ఆ ఇద్దరు సోదరులు భరించలేకపోయారు. నవంబర్ 23న ఆగ్రహంతో తమ భార్యలైన మినీ ప్రియ, రాధిక కుమారిలను శివ శంకర్ సాహు, నవీన్ సాహు హత్య చేశారు. వారిద్దరి మృతదేహాలను పొరుగున ఉన్న సిమ్‌డేగా జిల్లాలోని అటవీ ప్రాంతానికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ గొయ్యి తవ్వి పాతిపెట్టారు. ఆ తర్వాత తమ భార్యలు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారని ఆ ఇద్దరు సోదరులు ఆరోపించారు.

మరోవైపు ఈ విషయం తెలుసుకుని మినీ ప్రియ, రాధిక కుమారిల కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వారి ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేశారు. ఇద్దరు సోదరులపై అనుమానించి వారిని ప్రశ్నించారు. భార్యలను తామే హత్య చేసినట్లు శివ శంకర్ సాహు, నవీన్ సాహు ఒప్పుకున్నారని పోలీస్ అధికారి తెలిపారు. వారి సమాచారం ఆధారంగా భార్యల మృతదేహాలను గుర్తించి బయటకు తీసి పోస్ట్‌మార్టం కోసం తరలించినట్లు వివరించారు.

అయితే ఇద్దరు సోదరులతో పాటు వారి తల్లిదండ్రులైన సామేశ్వర్ సాహు, తిలేశ్వరి దేవిలను కూడా అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. హత్యకు వినియోగించిన గొడ్డలి, మృతదేహాలను తరలించిన అంబులెన్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

ఇస్లామిక్ మదర్సాల విద్యను, శిక్షణా వ్యవస్థను బలోపేతం చేయాలి

రాబితా ఏ మదారిసే ఇస్లామియ తెలంగాణ అధ్యక్షుడు మౌలానా మహమ్మద్ అబ్దుల్ ఖవీ



కరీంనగర్, నవంబర్ 27: (నేటినిజం ప్రతినిధి) ఇస్లామిక్ మదర్సాలలో విద్య ను, శిక్షణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మదర్సాల బాధ్యులు, రాబితా ఏ మదారిసే ఇస్లామియాతో కలిసి రావాలని, రాబ్తాయే మదారి సే ఇస్లామియా తెలంగాణ అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ ఖవి పిలుపునిచ్చారు. శుక్రవారం రాబితా ఏ మదర్సా ఇస్లామియా కరీంనగర్ జిల్లా శాఖ ఏర్పాటు చేసిన కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, పెద్దపల్లి నాలుగు జిల్లాల క్రియాశీలక రౌండ్ టేబుల్ సమావేశం నగరంలోని గోదాం గడ్డలోని ఫైజే అబ్రార్ లో సమావేశం నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు ముఫ్తీ ముహమ్మద్ ఫియాస్ మొహియుద్దీన్ రబితా ఏ మదర్సాలకు సంబంధించిన అంశాలపై పరిచయ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ ఖవి మాట్లాడుతూ, మదర్సాల విద్యా ప్రమాణాలను పెంచడానికి, విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి, ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఎంతగానో కృషి, పోరాటం అవసరమని, అదే సమయంలో మదర్సాల సంస్థాగత నిర్మాణం, పరిపాలనా వ్యవస్థను బలోపేతం చేయడం కూడా ప్రస్తుత అత్యంత ముఖ్యమైన అవసరమని అన్నారు. రబితా ఏ మదర్సా వ్యవస్థలోనూ జోక్యం చేసుకోదని ఆయన తెలిపారు.మదర్సాల బాధ్యులు తమ తమ మదర్సాలను రబితా మదర్సాలతో అనుసంధానం చేయడానికి గంభీరమైన మరియు ఆచరణాత్మక ప్రయత్నాలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తద్వారా మదర్సాలు ఒక వ్యవస్థీకృత సామూహిక విధానం కింద తమ మత, విద్యా, సంస్కరణ సేవలను మరింత మెరుగ్గా, సమర్థవంతంగా నిర్వహించగలవని తెలిపారు.ఈ సందర్భంగా, రాబ్తా ఏ మదర్సాలతో సభ్యత్వం పొందే విధానాన్ని, నమోదులోని వివిధ దశలను కూడా ఆయన వివరించారు.అనంతరం సమావేశంలో పాల్గొన్న మదర్సాల బాధ్యులు అడిగిన ప్రశ్నలకు మౌలానా అబ్దుల్ హవీ సమాధానం చెప్పారు. మదర్సాల విద్యా, సంస్థాగత స్థిరత్వం, పరస్పర ఐక్యత మరియు సామూహిక అభివృద్ధి కోసం సాధ్యమైనంత సహకారం అందిస్తామని, అలాగే రబితా మదర్సాలు చేపట్టే సంస్కరణాత్మక మరియు సంస్థాగత ప్రయత్నాలలో తాము పూర్తిస్థాయిలో పాల్గొంటామని పాల్గొన్నవారు హామీ ఇచ్చారు.ఈ ముఖ్యమైన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ముఫ్తి ఫియాస్ మొహియుద్దీన్, ముఫ్తీ ముహమ్మద్ యూనస్ ఖాస్మీ, ముఫ్తీ ఎతేమద్-ఉల్-హక్ ఖాస్మీ, హఫీజ్ మౌజ్జామ్ హుస్సేన్. ముఫ్తి అబ్దుల్ సలాం, హఫీజ్ అబ్దుల్ మజీద్ ఫైజీ, మౌలానా కలీం గజ్వేల్, మౌలానా అసిముద్దీన్ హుసమి, మౌలానా అసిముద్దీన్ హుసమి, హఫీజ్ ముహమ్మద్ వసీముద్దీన్, హఫీజ్ సయ్యద్ రిజ్వాన్, కరీంనగర్ నజీమ్, ముఫ్తీ అబ్దుల్ అలీమ్, నగరంలోని మదర్సాల బాధ్యులు హఫీజ్ నిజాన్ ఖాన్, హఫీజ్, జావేద్, జావేద్ అలీ, హఫీజ్ సయ్యద్ ఖలీల్ హుసామి, హఫీజ్ జాకీర్ జలీల్, మౌలానా అసిఫుద్దీన్ దబీర్ తో పాటు ఆయా జిల్లాల వివిధ మదర్సాల బాధ్యులు హాజరయ్యారు. చివరగా మౌలానా అబ్దుల్ ఖవీ దువాతో సమావేశం ముగిసింది.

'రుద్రమదేవి వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు కృషి'

గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో వర్ధంతి సభ

నల్గొండ, నవంబర్ 27: కాకతీయ వీరనారి రాణి రుద్రమదేవి వర్ధంతిని ఇకపై ప్రభుత్వం తరఫున అధికారికంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.

శుక్రవారం రాణి రుద్రమదేవి 737వ వర్ధంతి సందర్భంగా నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలోని రాణి రుద్రమదేవి మరణ వివరాలను తెలిపే శిలాశాసనం వద్ద ఆయన ఘన నివాళి అర్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాణి రుద్రమదేవి చందుపట్ల గ్రామంలోనే వీరమరణం పొందారనడానికి చారిత్రక ఆనవాళ్లు, రాతి శాసనాలు సజీవ సాక్ష్యంగా ఉన్నాయని పేర్కొన్నారు.

వరంగల్ కోట వేదికగా జరిగే కాకతీయ ఉత్సవాలు, ఇతర అధికారిక కార్యక్రమాల తరహాలోనే చందుపట్లలో కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు జరిగేలా చూడాలని గ్రామ సర్పంచ్ కోరిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. ఈ అంశాన్ని తప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి, సాంస్కృతిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి చందుపట్ల చరిత్రకు తగిన గుర్తింపు లభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు రాణి రుద్రమదేవి జ్ఞాపకం అందజేసి సన్మానించారు. సర్పంచ్ లతా వెంకటాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మేడవరపు అశోక్ రావు, ఉప సర్పంచ్ మంజుల శ్రీను, మార్కెట్ చైర్మన్ గుత్తా మంజుల, గాదగొని కొండయ్య, నరేందర్, వీరారెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మలీగి రెడ్డి రంగారెడ్డి, యేసు రత్నం, యాస కరుణాకర్ రెడ్డి, వివేకానంద యువజన మండలి అధ్యక్షుడు కొండ కోటేష్, పాలకవర్గ సభ్యులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.** RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.



డిసెంబర్‌లోగా డీలిమిటేషన్ బిల్లు పాస్ కాకపోతే.. జనాభా ఆధారంగానే సీట్ల పెంపు: ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, నవంబర్ 27: నషా ముక్త్ భారత్ అనేది ప్రభుత్వాలే కాదు పౌర సమాజం అనుకుంటేనే సాధ్యమవుతుందని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. ఈరోజు మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గత పదిహేను ఆదివారాల నుంచి నగరంలోని అనేక ప్రాంతాల్లో సైకిల్ రైడ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు డ్రగ్‌పై అవగాహన కల్పించేందుకు సెమినార్స్ నిర్వహిస్తామన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. తాను చేసే సైకిల్ రైడ్‌లో ఈగల్ టీమ్ పాల్గొంటుందన్నారు. దేశ భద్రతకు డ్రగ్ ముప్పు తీసుకువస్తుందని చెప్పుకొచ్చారు. ఈ నెల 29న వెయ్యి సైకిళ్లతో ఐమ్యాక్స్ నుంచి నెక్లెస్ రోడ్డులో సైకిల్ రైడ్ నిర్వహిస్తామని తెలిపారు.జనగాం, నర్సంపేటలో కూడా త్వరలో నషా ముక్తా భారత్‌లో భాగంగా సైకిల్ రైడ్ చేస్తామని ఎంపీ అన్నారు. భవిష్యత్తులో ఉత్తరాది ప్రజలు.. జనాభాకు అనుగుణంగా డీలిమిటేషన్ చేయమని ఆందోళన ప్రారంభిస్తే పరిస్థితి ఏంటిని ప్రశ్నించారు. దక్షిణాది, ఉత్తరాది అంటూ తారతమ్యాలు సృష్టిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఈశాన్య రాష్ట్రాల పరిస్థితి ఏంటి.. ఒక్కో రాష్ట్రానికి ఒకే ఎంపీ ఉన్న పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. డిసెంబర్ వరకు డీలిమిటేషన్ బిల్లు పాస్ కాకపోతే.. తరువాత జనాభాకు అనుగుణంగా చేయాల్సి వస్తుందని అన్నారు.